

పటేల్ జీవితం స్ఫూర్తిదాయకం

- ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు
- భూపాలపల్లిలో ఐక్యత ర్యాలీ



ఐక్యత ర్యాలీలో ఎమ్మెల్యే గండ్ర, కలెక్టర్ రాహుల్ శర్మ, అధికారులు

కృష్ణకాలనీ, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): దేశం కోసం అనేక త్యాగాలు చేసిన సర్దార్ వల్లభ్‌భాయి పటేల్ జీవితం స్ఫూర్తిదాయకమని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు అన్నారు. జిల్లా కేంద్రంలో కేంద్ర యువజన సర్వీసులు, క్రీడా వ్యవహారాల మంత్రిత్వ శాఖ ఆదేశాల మేరకు మై భారత్, ఎన్ఎస్ఎస్, ఎన్‌సీసీ సంస్థల ఆధ్వర్యంలో సర్దార్ పటేల్ జయంతిని పురస్కరించుకొని నిర్వహించిన ఐక్యత ర్యాలీలో కలెక్టర్ రాహుల్‌శర్మతో కలిసి ఎమ్మెల్యే పాల్గొన్నారు. అంబేద్కర్ స్టేడియం నుంచి అంబేద్కర్ కూడలి వరకు ఈ ర్యాలీ కొనసాగింది. ఎమ్మెల్యే మాట్లాడుతూ పటేల్ స్ఫూర్తితో రాష్ట్ర ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమానికి అత్యంత ప్రాధాన్యం ఇస్తోందన్నారు. కలెక్టర్ మాట్లాడుతూ భారత దేశ స్వేచ్ఛ కోసం వల్లభ్ భాయి పటేల్ తపించేవారని స్మరించుకున్నారు. ప్రతి ఒక్కరూ ఐక్యతతో కలిసి మెలసి ఉండాలని ఆయన చాటిచెప్పారన్నారు. ఈ కార్యక్రమంలో మేరా యువ భారత్ వరంగల్ జిల్లా డిప్యూటీ డైరెక్టర్ చింతల అన్వేష్, సూపరింటెండెంట్ బానోతు దేవిలాల్, అడిషనల్ ఎస్పీ నరేష్‌కుమార్, క్రీడల శాఖ అధికారి రఘు పాల్గొన్నారు.

కాళేశ్వరాలయంలో కోలాహలం

భారీగా తరలివచ్చిన భక్తులు



ఆలయంలో వత్తులు వెలిగిస్తున్న భక్తులు

మహదేవపూర్, నవంబరు 19(ఆంధ్రజ్యోతి) : మండలంలోని కాళేశ్వరాలయంలో బుధవారం కార్తీక మాస ప్రత్యేక పూజలు జరిగాయి. ప్రధాన పండితులు, అర్చకులు తెల్లవారుజాము నుంచే స్వామి వారికి అభిషేకాలు నిర్వహించారు. భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చి ముందుగా గోదావరిలో స్నానం ఆచరించారు. అతర్వాత కాళేశ్వర ముక్తీశ్వర స్వామి వారికి అభిషేకాలు, పూజలు చేశారు. అనంతరం శుభానందదేవి ఆలయంలో పూజలు చేశారు. గోదావరిలో బుధవారం ఒక్కరోజే సుమారు 40వేల మంది భక్తులు పుణ్యస్నానాలు ఆచరించారు. గోదావరి మాతకు చీర, సారె సమర్పించుకున్నారు. అనంతరం ఆలయంలో పూజా కార్యక్రమాలు చేపట్టారు. గురువారం అమావాస్య ఉండగా, బుధవారంతో కార్తీక మాసం చివరి రోజు కాబట్టి పెద్ద ఎత్తున భక్తులు తరలివచ్చారు.

రూ. కోటి 20వేల ఆదాయం

కార్తీక మాసం ప్రారంభమైనప్పటి నుంచి బుధవారం వరకు కాళేశ్వరానికి 30 రోజుల ఆదాయం రూ. కోటి 20 వేల సమకూరినట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు. ఎన్నడూ లేని విధంగా ఆలయానికి ఆదాయం పెరగడం సంతోషకరమని అర్చకులు భావించారు. తెలంగాణ ప్రభుత్వం మహిళలకు ఉచిత బస్సులు ఏర్పాటు చేయడంతో ఈసారి మహిళలు కాళేశ్వరానికి పెద్ద ఎత్తున తరలివచ్చారని అర్చకులు తెలుపుతున్నారు.



- టన్ను బొగ్గు ఉత్పత్తి ఖర్చు రూ. 9వేలపైనే..
- ఆరేళ్లలో రూ.15,305 కోట్లకు చేరిన నష్టాలు !
- భూగర్భ గనుల్లో ఉత్పత్తి పెంచేందుకు అధికారుల కసరత్తు
- ఏటా రూ. 215 కోట్ల నష్టం తగ్గించొచ్చని అంచనా

ఆదాయం చారాణా వ్యయం బారాణా



భూపాలపల్లి, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): భూగర్భ గనుల నిర్వహణలో ప్రతికూల పరిస్థితులు ఎదురవుతున్నాయి. ఆరేళ్లకాలంలో రూ.15, 305 కోట్ల నష్టాలు ఎదురయ్యాయని లెక్కలు చెబుతున్నాయి. సింగరేణి వ్యాప్తంగా ఉన్న భూగర్భ గనుల్లో బొగ్గు ఉత్పత్తి వల్ల వస్తున్న ఆదాయం కంటే ఖర్చు అధికంగా ఉంటోంది. దీంతో ఈ గనుల నిర్వహణ యాజమాన్యానికి తలనొప్పిగా మారిందని తెలుస్తోంది. ఈ క్రమంలోనే నష్టాలను తగ్గించే దిశగా సంస్థ కసరత్తు ప్రారంభించినట్లు సింగరేణి వర్గాలు వెల్లడించాయి.

రాష్ట్రవ్యాప్తంగా మొత్తం ఏడు గనుల్లో బొగ్గు నిల్వలు తగ్గిపోవడం లేదా ఉత్పత్తి మందగించడం లాంటి పరిస్థితులు ఎదురవుతున్నాయి. ఆయా గనుల్లో అంతకుమించి తవ్వకాలు జరిగే అవకాశం లేకపోవడంతో ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టే దిశగా అధికారులు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు. ముఖ్యంగా బొగ్గు నిల్వలు ఉండి, ఉత్పత్తి వ్యయం అధికంగా ఉన్న గనులను గుర్తించడం ద్వారా వాటిని ఉపరితల గనులుగా మార్చడం లేదా ప్రస్తుతం జరుగుతున్న బొగ్గు ఉత్పత్తి కంటే అధికంగా ఉత్పత్తి చేయడం వంటి అంశాలపై దృష్టి సారించినట్లు తెలుస్తోంది. భూగర్భ గనుల బొగ్గు ఉత్పత్తిలో ఆశించిన ఆర్థిక ప్రయోజనాలు లేకపోవడం వల్ల నష్టాల శాతం క్రమంగా పెరుగుతూ వస్తోందని అధికార వర్గాలు అంటున్నాయి. ఈ నేపథ్యంలో భూగర్భ గనుల్లో కనీసం 20 శాతం బొగ్గు ఉత్పత్తిని అధికంగా సాధించడం ద్వారా ఏడాదికి కనీసం రూ. 215 కోట్ల మేర నష్టాలను తగ్గించే అవకాశం ఉంటుందని అధికారులు అంచనా వేస్తున్నారు. ఈ క్రమంలోనే భూగర్భ గనుల వారీగా బొగ్గు ఉత్పత్తిని పెంచేందుకు కార్మికులకు అవగాహన కల్పించి లక్ష్యాలను నిర్దయించాలని యోచిస్తున్నట్లు తెలుస్తోంది. వాస్తవానికి భూగర్భ గనుల్లో టన్ను బొగ్గును ఉత్పత్తి చేయడానికి ప్రస్తుతం రూ. 9,466 ఖర్చు అవుతోందని చెబుతున్నారు. అదే క్రమంలో ఒక టన్ను విక్రయ ధర రూ. 4,864 మాత్రమే ఉంది. దీంతో ఒక టన్నుపై రూ. 4,602 నష్టం వస్తోందని చెబుతున్నారు. ఫలితంగా గడిచిన ఆరేళ్లలో రూ. 15,305 కోట్లకు పైగా నష్టాలు వాటిల్లాయి. అయితే.. భూగర్భ గనుల వల్ల ఏర్పడుతున్న నష్టాన్ని ఉపరితల గనుల్లో జరుగుతున్న అదనపు ఉత్పత్తి, డిపాజిట్లపై వచ్చిన వడ్డీ, ఎస్‌టీపీపీతో వచ్చిన లాభాల ద్వారా పూడ్చుకోగలుగుతున్నట్లు తెలుస్తోంది. కేవలం ఉపరితల గనుల ఉత్పత్తి కారణంగానే సంస్థకు కాస్తోకూస్తో నికర లాభాలు కనబడుతున్నాయని అంటున్నారు. ఈ క్రమంలో భూగర్భ గనుల్లోనూ వ్యయాన్ని తగ్గించేందుకు ఉత్పత్తిని పెంచడమే ఏకైక మార్గమన్న నిర్ణయానికి వచ్చినట్లు సమాచారం. ప్రస్తుతం 87 లక్షల టన్నుల ఉత్పత్తి చేయాల్సి ఉండగా 49లక్షల టన్నులకు తగ్గిపోయింది. ఈ కారణంగానే ఉత్పత్తి వ్యయం భారీగా పెరిగినట్లు గుర్తించారు. సగటున అమ్మకం ధర కంటే ఉత్పత్తి వ్యయం 75 శాతం పెరిగిందని అంటున్నారు.

భూపాలపల్లి ఏరియాలో..

భూగర్భ గనుల కారణంగా వస్తున్న నష్టాలను పూడ్చుకొనే దిశగా సింగరేణి (మిగతా 8లో...)

ఉత్పత్తి వ్యయం, నష్టం ఇలా..

సంవత్సరం	ఉత్పత్తి ఖర్చు	అమ్మకపు ధర	నష్టం
2019-20	5413	3,135	2,325
2020-21	9155	2,935	6,220
2021-22	8210	3,300	4,910
2022-23	7451	4,088	3,363
2023-24	9368	4,628	4,740
2024-25	9466	4,864	4,602

కేటీపీపీ సీఈని కలిసిన నిర్వాసితులు



కేటీపీఈ సీఈకి వినతిపత్రం ఇస్తున్న నిర్వాసితులు

మల్హర్, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): జెన్‌కో భూ ఉపరితల బొగ్గు తాడిచర్ల నిర్వాసితులు కేటీపీపీ సీఈ శ్రీప్రకాశ్‌ను బుధవారం కలిశారు. పెద్ద తాడిచర్ల డేంజర్ జోన్‌లో ఉన్న గ్రామంలో పూర్వం నుంచి నివసిస్తున్న వారి ఇళ్లను సేకరించాలని, పరిహారం అందించి సురక్షిత ప్రాంతానికి తరలించాలని కోరారు. గత పర్యటనలో ఎనర్జీ ప్రిన్సిపల్ సెక్రటరీ, జెన్‌కో సీఎండీ పాత నంబర్ల ప్రకారం సేకరిస్తామన్న 1080 ఇళ్లకు అదనంగా 30 శాతం పెంచుతూ 1500 ఇళ్లను సేకరించి పరిహారం చెల్లించాలన్నారు. దీనిపై సీఈ సానుకూలంగా స్పందించినట్లు భూనిర్వాసితులు తెలిపారు. ఈ కార్యక్రమంలో భూనిర్వాసితులు తాండ్ర మల్లేష్, తాండ్ర స్వరూప రాణి తదితరులు పాల్గొన్నారు.

పేకాటరాయుళ్ల అరెస్టు

మంగపేట, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి) పేకాడుతున్న ఐదుగురిని అరెస్టు చేసినట్లు మంగపేట ఎస్సై టీవీఆర్ సూరి తెలిపారు. బుధవారం మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కమలాపురం గ్రామంలో పేకాడుతున్నారని మంగళవారం సాయంత్రం తమకు వచ్చిన సమాచారం అందిందన్నారు. దీంతో దాడులు నిర్వహించి పేకాడుతున్న వారిని అదుపులోకి తీసుకుని రూ. 6,810 నగదు, పేకలను స్వాధీనం చేసుకున్నట్లు వెల్లడించారు.

చీరలు సకాలంలో పంపిణీ చేయాలి

వీడియో కాన్ఫరెన్స్‌లో సీఎం రేవంత్‌రెడ్డి



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న ములుగు కలెక్టర్ దివాకర, అధికారులు

ములుగు కలెక్టరేట్/కృష్ణకాలనీ, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): స్వయం సహాయక సంఘాల మహిళా సభ్యులకు ప్రభుత్వం అందిస్తున్న చీరలను సకాలంలో పంపిణీ చేయాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. హైదరాబాద్ నుంచి ఆయన బుధవారం వీడియోకాన్ఫరెన్స్ నిర్వహించారు. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు సీతక్క, పొన్నం ప్రభాకర్, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, వాకిటి శ్రీహరి, సీఎం సలహాదారులు వేం నరేందర్‌రెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావుతో కలిసి మాట్లాడారు. ములుగు నుంచి ఆ జిల్లా కలెక్టర్ టీఎస్.దివాకర, భూపాలపల్లి నుంచి ఆ జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ ఇందిరాగాంధీ జయంతిని పురస్కరించుకొని రాష్ట్రంలోని కోటి మంది మహిళలకు చీరలు పంపిణీ చేయాలని నిర్ణయించినట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమాన్ని పండుగ వాతావరణంలో నిర్వహించాలని సూచించారు. మహిళల అభ్యున్నతే రాష్ట్ర ప్రగతికి నిదర్శనమన్నారు. డిసెంబరు 9 నాటికి పూర్తిస్థాయిలో చీరలను పంపిణీ చేయాలని ఆదేశించారు. ములుగు కలెక్టర్ దివాకర మాట్లాడుతూ జిల్లాలోని మహిళా సమాఖ్య సభ్యులందరికీ చీరల పంపిణీ కార్యక్రమాన్ని విజయవంతం చేస్తామని, అర్హులైన ప్రతి ఒక్కరికీ అందజేయడానికి కృషి చేస్తామని అన్నారు. భూపాలపల్లి కలెక్టర్ రాహుల్ శర్మ మాట్లాడుతూ చీరల పంపిణీ కార్యక్రమాన్ని భూపాలపల్లి, కాటారం డివిజన్లలో పండుగ వాతావరణంలో చేపడతామన్నారు. వీడియోకాన్ఫరెన్స్‌లో ములుగు అదనపు కలెక్టర్లు సి.హెచ్.మహేందర్‌జీ, సంపత్‌రావు, డీఆర్‌డీవో పీడీ శ్రీనివాస్, భూపాలపల్లి డీఆర్‌డీవో పీడీ బాలకృష్ణ, డీఈపవో శీలత, మహిళా సంఘాల అధ్యక్ష, కార్యదర్శులు పాల్గొన్నారు.

'డబుల్ బెడ్‌రూం' కేటాయించాలని ఆందోళన

- ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం ఎదుట పలువురి ధర్నా



ఆందోళనకారులను స్టేషన్‌కు తరలిస్తున్న పోలీసులు

కృష్ణకాలనీ, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): డబుల్ బెడ్‌రూం లబ్ధిదారులు భూపాలపల్లిలోని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు క్యాంపు కార్యాలయం వద్ద ఆందోళనకు దిగారు. అర్హులైన తమకు డబుల్ బెడ్‌రూం ఇళ్లు ఎందుకు ఇవ్వడం లేదని ధర్నా చేశారు. గత ప్రభుత్వం తమను అర్హులుగా ఎంపిక చేసిందని, ప్రస్తుత సర్కారు తమను పట్టించుకోవడం లేదని ఆందోళనకు దిగారు. పోలీసులు అక్కడకు చేరుకొని ఆందోళనను విరమించి బలవంతంగా స్టేషన్‌కు తరలించారు.

రామన్నగూడెంలో వృద్ధురాలి హత్య

- విచారణ చేపట్టిన పోలీసులు



పద్మ (ఫైల్)

నెల్లికుదురు, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి) : గుర్తుతెలియని వ్యక్తులు వృద్ధురాలును హత్యచేసిన ఘటన మహబూబాబాద్ జిల్లా నెల్లికుదురు మండలం రామన్నగూడెంలో మంగళవారం రాత్రి జరిగింది. ఎస్సై రమేష్‌బాబు తెలిపిన వివరాల ప్రకారం.. కురవి మండలం తిర్మలాపురం గ్రామానికి చెందిన కల్లెపు పద్మ (62)కు ముగ్గురు కుమార్తెలేజ. వారి వివాహం అనంతరం 7 ఏళ్ల క్రితం ఆమె భర్త సీతయ్య మృతి చెందాడు. దీంతో నెల్లికుదురు మండలం రామన్నగూడెంలోని రెండో కూతురు కోయ్యేడి సరిత-సుధాకర్ దంపతుల ఇంట్లో పద్మ ఉంటోంది. ఈ క్రమంలో బతుకుదెరువు కోసం అల్లుడు, కుమార్తె హైదరాబాద్‌లో నివసిస్తుండగా పద్మ ఇంట్లో ఒంటరిగా ఉంటోంది. రోజూ ఉదయం 5 గంటలకు నిద్రలేచి, వాకిలి ఊడ్చి ముగ్గులు వేసేది. బుధవారం ఉదయం 8 గంటలు కావస్తున్నప్పటికీ ఆమె బయటికి రాకపోవడంతో గ్రామస్థులు తలుపులు తెరిచి చూశారు. తలకు తీవ్రగాయాలై మంచంలోనే పద్మ మృతిచెంది ఉంది. గుర్తుతెలియని వ్యక్తులు కర్రలతో కొట్టి హత్యచేసి ఉండొచ్చని భావిస్తున్నారు. కేసు నమోదు చేసిన పోలీసులు ఈ ఘటనపై విచారణ చేపడుతున్నారు.

ఘనంగా ఇందిరా గాంధీ జయంతి



కాటారంలో ఇందిరాగాంధీ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న నేతలు

కాటారం, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): ఇందిరా గాంధీ జయంతి వేడుకలకు మండల కేంద్రంలోని కాంగ్రెస్ కార్యాలయంలో బుధవారం జరిగాయి. ఇందిరాగాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి కాంగ్రెస్ నాయకులు నివాళులర్పించారు. కేక్ కట్ చేసి, పండ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు చీటూరి మహేష్‌గౌడ్ మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ తదితర సామాజికవర్గాల పేదలకు ఇందిరాగాంధీ చేసిన సేవలు చిరస్మరణీయమన్నారు. దేశ సమగ్రతకు ఆమె కృషి చేశారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఒడిపిలవంచ మాజీ సర్పంచ్ కోడి రవికుమార్, కాంగ్రెస్, యూత్ కాంగ్రెస్ నాయకులు గిరీష్, వెంకటేశ్, కిశోర్, రఘునందన్, సుధాకర్, రాజేందర్, శ్రీకాంత్, రాజేష్, గణేష్, చింటు తదితరులు పాల్గొన్నారు.

- చిట్యాలలో..

చిట్యాల (ఆంధ్రజ్యోతి) : ఇందిరా గాంధీ జయంతి వేడుకలను కాంగ్రెస్ ఆధ్వర్యంలో మండల కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లు అర్పించారు. పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి ముకిరాల మధువంశీకృష్ణ, జిల్లా నాయకులు చిలుకల రాయకొంరు, దొడ్డి కిష్టయ్య, మండల ప్రధాన కార్యదర్శి గడ్డం కొమురయ్య, నాయకులు సత్యనారాయణ, ఆరెపెల్లి మల్లయ్య, నర్సింహరాములు, ఆకుల రవీందర్, మొగిలి, అల్లం రాజు, ఏకు కిషన్ తదితరులు పాల్గొన్నారు.

లేటుగా వచ్చినా.. లేటెస్టేనట!

- ప్రభుత్వ కార్యాలయాల్లో నిర్లక్ష్యం
- మహదేవపూర్ మండలంలో అలస్యంగా వస్తున్న అధికారులు

వివరాలు 8వ పేజీలో...

వృద్ధులను ఆదరించాలి

జిల్లా జూనియర్ సివిల్ జడ్జి దిలీప్‌కుమార్

కృష్ణకాలనీ, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): వృద్ధులను ప్రతి ఒక్కరూ ఆదరించాలని జిల్లా జూనియర్ సివిల్ జడ్జి ఎస్.ఆర్. దిలీప్‌కుమార్ నాయక్ అన్నారు. న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో సబ్ కోర్టు ప్రాంగణంలో బుధవారం నిర్వహించిన అవగాహన సదస్సుకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సంప్రదాయబద్ధంగా, విలువలతో కూడిన జీవితాన్ని ప్రతి ఒక్కరూ అలవర్చుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి జి.అఖిల, చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సెలర్ శ్రీనివాస్, న్యాయ సేవాధికార సంస్థ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



సదస్సులో మాట్లాడుతున్న జిల్లా జూనియర్ సివిల్ జడ్జి దిలీప్‌కుమార్

పాఠశాలలు పరిశుభ్రంగా ఉండాలి

5.0 కార్యక్రమ పరిశీలకుడు అబ్దుల్‌హై

చిట్యాల, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రభుత్వ పాఠశాలలు పరిశుభ్రంగా ఉండాలని 5.0 కార్యక్రమ జిల్లా పరిశీలకుడు, వరంగల్ డైట్ కాలేజీ ప్రిన్సిపాల్ అబ్దుల్‌హై అన్నారు. 5.0 కార్యక్రమంలో భాగంగా మండలంలోని జూకల్లు ఉన్నత పాఠశాలను ఆయన బుధవారం సందర్శించారు. పాఠశాల ఆవరణ, తరగతి గదులు, సౌకర్యాలను పరిశీలించారు. పరిశుభ్రత, భద్రతా చర్యలు అమలుపై ఉపాధ్యాయులతో సమీక్షించారు. ఆయన వెంట జిల్లా సెక్టోరియల్ అధికారి, సీఎంవో రమేష్, ప్రధానోపాధ్యాయుడు గిరగాని కృష్ణ, ఉపాధ్యాయులు ఉన్నారు.



జూకల్లు పాఠశాలను సందర్శించిన జిల్లా పరిశీలకుడు అబ్దుల్‌హై

హేమాచలుడి సన్నిధిలో కేంద్ర మాజీ మంత్రి

● సర్వే సత్యనారాయణ ప్రత్యేక పూజలు



హేమాచలుడి సన్నిధిలో మాజీ మంత్రి సర్వే సత్యనారాయణ

మంగపేట నవంబరు 19 (ఆంధ్రజ్యోతి) ములుగు జిల్లా మంగపేట మండలంలోని మల్లూరు హేమాచల లక్ష్మీనరసింహస్వామి దేవస్థానంలో బుధవారం కేంద్ర మాజీ మంత్రి సర్వే సత్య నారాయణ ప్రత్యేక పూజలు చేశారు. ఉదయమే ఆలయానికి వచ్చిన సత్య నారాయయణ చింతా మణి జలపాతాన్ని సందర్శించారు. అనంతరం గర్భగుడిలో వారి కుటుంబ సభ్యుల నామ గోత్రాలపై అర్చకులు పూజలు చేశారు. ఈ సందర్భంగా అర్చకులు పవన్ కుమా రాచార్యులు ఆలయ విశిష్టతను, స్థల పురాణాన్ని సత్యనారాయణకు వివరించారు. ప్రధాన అర్చకుడు రాజశేఖర శర్మ స్వామి వారి శేష వస్త్రాలు, తీర్థ ప్రసాదాలు ఆయనకు అందజేశారు.

ఆందోళనను విరమించిన గ్రామస్థులు



గ్రామస్థులతో మాట్లాడుతున్న ఎస్సై తిరుపతిరావు

వెంకటాపురం, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): భద్రాద్రి కొత్తగూడెం జిల్లా నుంచి వచ్చే ఇసుక లారీల వల్ల మండలంలో రోడ్లు ధ్వంసమవుతున్నాయని పేర్కొంటూ ఆలుబాక గ్రామస్థులు మంగళవారం ఆందోళన చేపట్టారు. దీంతో వందల సంఖ్యలో ఇసుక లారీలు రోడ్డుకిరువైపులా నిలిచిపోయాయి. ఈ విషయం తెలుసుకున్న ఎస్సై కొప్పుల తిరుపతిరావు బుధవారం ఆలుబాక గ్రామానికి చేరుకుని ఆందోళనకారులతో మాట్లాడారు. మండల కేంద్రానికి ఇసుక లారీలు రాకుండా యాకన్నగూడెం సమీపంలోనే అడ్డుకుంటామని హామీ ఇవ్వడంతో గ్రామస్థులు ఆందోళనను విరమించారు.

కలెక్టర్‌ను సన్మానించిన హెచ్‌ఎంల సంఘం



కలెక్టర్‌ను సన్మానిస్తున్న ప్రధానోపాధ్యాయుల సంఘం

జనగామ కల్చరల్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): జల్‌శక్తి పురస్కారం అందుకున్న జిల్లా కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషాను ప్రధానోపాధ్యాయుల సంఘం ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. బుధవారం ప్రధానోపాధ్యాయుల సంఘం రాష్ట్ర కార్యదర్శి బుర్ర రమేష్ నేతృత్వంలో కలెక్టరేట్‌లో కలెక్టర్ రిజ్వాన్ బాషాను కలిసి శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో నాయకులు లక్ష్మణ్ గౌడ్, బీమా నాయక్, కిరణ్‌కుమార్, అంజయ్య, ఈర్యా, కొండ శ్రీనివాస్, షాడ రవి తదితరులు పాల్గొన్నారు.

మానసికోల్లాసానికి క్రీడలు దోహదం

ఏటూరునాగారం ఐటీడీఏ పీవో చిత్రామిశ్రా
జోనల్ స్థాయి క్రీడలు ప్రారంభం



క్రీడాకారులను ఉద్దేశించి మాట్లాడుతున్న ఐటీడీఏ పీవో చిత్రామిశ్రా

ఏటూరునాగారం, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): క్రీడలు మానసికోల్లాసానికి దోహదపడతాయని ఏటూరునాగారం ఐటీడీఏ పీవో చిత్రామిశ్రా అన్నారు. విద్యార్థుల్లో క్రీడాస్ఫూర్తిని పెంపొందించే లక్ష్యంతో ములుగు జిల్లా ఏటూరునాగారం మండల కేంద్రంలోని కొమురంభీమ్ మినీ స్టేడియంలో బుధవారం వరంగల్, హనుమకొండ, జనగాం, మహబూబాబాద్, ములుగు, భూపాలపల్లి, కరీంనగర్, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల జిల్లాల జోనల్ లెవల్ క్రీడా పోటీలకు పీవో ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. అయితే, వివిధ జిల్లాలోని 95 మంది పీఈటీలు ఇక్కడికి వచ్చి ఉమ్మడి జిల్లాలోని ప్రభుత్వ గిరిజన సంక్షేమ, ఆశ్రమ పాఠశాల, హాస్టళ్లకు చెందిన సుమారు 1500 మంది విద్యార్థులకు ఐటీడీఏ ఆధ్వర్యంలో ఈ పోటీలను నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమానికి డీడీ దబ్బగట్ల జనార్దన్ సభ అధ్యక్షులుగా వ్యవహరించారు. అతిథులకు విద్యార్థులు ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం పీవో జ్యోతి ప్రజ్వలన చేసి, జాతీయ, క్రీడా జెండాను ఎగురవేశారు. మొదటి రోజు బాల బాలికల అండర్-14, 17 కబడ్డీ, ఖో-ఖో, వాలీబాల్, క్యారం, టెన్నికైట్, అథ్లెటిక్స్ పోటీలను నిర్వహించారు. ఈ సందర్భంగా చిత్రమిశ్రా మాట్లాడుతూ.. క్రీడల్లో గెలుపోటములు సహజమన్నారు. క్రీడల్లో రాణించి రాష్ట్రస్థాయికి ఎంపిక కావాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఐటీడీఏ ఏపీవో జె. వసంతరావు, ఏవో రాజుకుమార్, డీడీ ప్రేమకళ, ఏటీడీవోలు అజయ్, హసీనా, క్రీడా అధికారులు ఆదినారాయణ, పీడీలు, పీఈటీలు, ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

22న వందేమాతరం గేయాన్ని ఆలపించాలి

ములుగు జిల్లా బీజేపీ అధ్యక్షుడు బలరాం



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా అధ్యక్షుడు బలరాం

ములుగు కలెక్టరేట్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): వందేమాతరం గేయం రచించి 150 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా దేశవ్యాప్తంగా వేడుకలు నిర్వహించడంలో భాగంగా ఈనెల 22న ములుగు జిల్లాలో ఆలపించాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు సిరికొండ బలరాం పిలుపునిచ్చారు. బుధవారం జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. యావత్ భారతావనిని ఒక్కటిగా నిలిపి, దేశభక్తి, ఐక్యతను చాటిచెప్పిన వందేమాతరం గేయాన్ని జిల్లాలోని అన్ని మండల కేంద్రాల్లో విద్యార్థులు, యువకులు, ప్రజలను భాగస్వాములను చేయాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శి, వందేమాతరం గేయం కార్యక్రమ జిల్లా కన్వీనర్ జాడి వెంకట్, కో-కన్వీనర్లు అల్లె శోభన్, బైకని మహేందర్, పార్టీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు భూక్య జవహర్‌లాల్ తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ భవనాన్ని నిర్మించాలి

జీఎస్పీ రాష్ట్ర కార్యదర్శి సాయి

వెంకటాపురం, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బెస్తగూడెం గ్రామ పంచాయతీ పరిధిలోని కమ్మరిగూడెం గ్రామంలో అంగన్‌వాడీ భవనాన్ని నిర్మించాలని గోండ్వాన సంక్షేమ పరిషత్ (జీఎస్పీ) రాష్ట్ర కార్యదర్శి పూనెం సాయి డిమాండ్ చేశారు. బుధవారం గ్రామంలో సంఘం ముఖ్య కార్యకర్తల సమావేశం నాగరాజు అధ్యక్షతన జరగగా ఆయన పాల్గొని మాట్లాడారు. గ్రామంలోని చిన్నపిల్లలు, గర్భిణులు, బాలింతలు అంగన్‌వాడీ భవనం లేక అద్దె ఇంట్లో ఇబ్బందులు పడుతున్నారన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి నూతన భవనాన్ని నిర్మించాలని, అలాగే బెస్తగూడెం అంగన్‌వాడీ కేంద్రం భవనానికి మరమ్మతు చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో నాయకులు అనిల్, వంశీ, తదితరులు పాల్గొన్నారు.

పాన్‌షాప్‌లో చోరీ

వెంకటాపురం, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని వేపచెట్టు సెంటర్‌లో గల పాన్‌షాపులో మంగళవారం రాత్రి గుర్తు తెలియని దుండగులు చోరీకి పాల్పడ్డారు. బాధితుడు నర్సింహారావు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. బుధవారం ఉదయం షాపు తీసి చూడగా గుర్తుతెలియని వ్యక్తులు షాపు పైకప్పు పగులగొట్టి లోపలికి చొరబడ్డారని అన్నారు. ఈ ఘటనలో రూ.15 వేల విలువ చేసే సిగరెట్ ప్యాకెట్లు, చిల్లర, ఇతర సామగ్రి దొంగిలించబడ్డారని తెలిపారు. ఈ విషయమై స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు బాధితుడు తెలిపారు.

మేడారాన్ని లంబాడీలు ఆక్రమించుకుంటున్నారు

● తుడుందెబ్బ అధ్యక్షుడు సునీల్



నిరసన వ్యక్తం చేస్తున్న ఆదివాసీ నాయకులు

తాడ్వాయి, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): మేడారంలో లంబాడీల ఆధిపత్యం పెరిగిందని, దీనిని సహించబోమని ఆదివాసీ హక్కుల పోరాట సమితి తుడుందెబ్బ మేడారం గ్రామ కమిటీ అధ్యక్షుడు గడిగ సునీల్ అన్నారు. మేడారం దేవస్థానంలో సంఘం నాయకులు, పూజారులు, స్థానిక ఆదివాసీల ఆధ్వర్యంలో బుధవారం నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సునీల్ మాట్లాడుతూ మేడారంలోని అమాయకపు గిరిజన 5వ షెడ్యూల్ తెగలకు చెందిన వారిని వాడుకుంటూ భూములు, వ్యాపారాల ఆక్రమణ చేస్తున్నారని ఆరోపించారు. మేడారం కేంద్రంగా 20 సంవత్సరాల క్రితం ఒక్క వలస లంబాడీ కుటుంబం జీవనం కొనసాగించలేదన్నారు. జాతర అభివృద్ధిని పసికడుతూ మేడారం పరిసరాలను ఆక్రమించుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

అనుమతులు లేకుండా ఇష్టారాజ్యంగా అక్రమ ఇంటి నిర్మాణాలు జరుగుతున్నాయని వెంటనే మేడారంలో పెసా గ్రామ సభ నిర్వహించి స్థానికులు కానివారి ఇళ్లను తొలగించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ చిడం బాబురావు, గ్రామ కమిటీ అధికారం ప్రతినిధి సిద్దబోయిన రవి, ప్రధాన కార్యదర్శి పీరిల వినోద్, పెసా మొబిలైజర్ సిద్దబోయిన నర్సింగరావు, సభ్యులు ఆలం సమ్మారావు, అట్టం నరేష్, ఆలం శంకర్, సుధీర్, లక్ష్మణ్, అనిల్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

బాలికలు ఉన్నత స్థితికి చేరుకోవాలి

వరంగల్ ఎంపీ కడియం కావ్య
సీసీ రోడ్ల నిర్మాణానికి శంకుస్థాపన



జఫర్‌గఢ్ కస్తూర్బాలో మాట్లాడుతున్న ఎంపీ కడియం కావ్య

జఫర్‌గఢ్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): బాలికల విద్యాభివృద్ధికి ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలను సద్వినియోగం చేసుకుని చదువులో రాణిస్తూ ఉన్నత స్థితికి చేరుకోవాలని వరంగల్ ఎంపీ కడియం కావ్య అన్నారు. జఫర్‌గఢ్ మండలం సాగరం క్రాస్ వద్ద గల ఆర్‌అండ్‌బీ రోడ్డు నుంచి ఆదర్శ పాఠశాల, కస్తూర్బా బాలికల విద్యాలయానికి రూ.23 లక్షల వ్యయంతో చేపట్టిన సీసీ రోడ్ల నిర్మాణానికి ఆమె బుధవారం ఎమ్మెల్యే కడియం శ్రీహరితో కలిసి శంకుస్థాపన చేశారు. అనంతరం వారు కస్తూర్బాను సందర్శించి బాలికల చదువు, విద్యాబోధనను అడిగి తెలుసుకున్నారు. ప్రిన్సిపాల్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఎంపీ కావ్య మాట్లాడుతూ మహిళా విద్యకు పాటుపడిన సావిత్రిబాయి పూలేను బాలికలు ఆదర్శంగా తీసుకుని పోటీతత్వంతో ముందుకు సాగాలన్నారు. చదువు ద్వారానే జీవన ప్రగతి సాధ్యమన్నారు. మహిళల ప్రగతి ద్వారానే సమాజాభివృద్ధి చెందుతుందన్నారు. గతంలో విద్యామంత్రిగా పనిచేసిన ప్రస్తుత ఎమ్మెల్యే కడియం శ్రీహరి నాడు గురుకుల పాఠశాలలను ఇంటర్ స్థాయికి అప్‌గ్రేడ్ చేయడం వల్ల నేడు అనేక మంది బాలికలు నాణ్యమైన విద్యను పొందుతున్నారన్నారు.

విద్యాభివృద్ధికి ప్రభుత్వం పెద్దపీట : ఎమ్మెల్యే కడియం

విద్యారంగ అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట వేసి నిధులు మంజూరు చేస్తోందని స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి అన్నారు. రాష్ట్రంలో అత్యధిక గురుకుల పాఠశాలలతో విద్యా రంగంలో తెలంగాణ రోల్ మోడల్‌గా నిలుస్తుందన్నారు. జఫర్‌గఢ్ మండలం కోనాయిచలం శివారులో రూ.200 కోట్లతో నిర్మించతలపెట్టిన యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాల నిర్మాణ పనులు వచ్చే నెలలో ప్రారంభమవుతాయన్నారు. నియోజకవర్గంలోని ఏడు కస్తూర్బా విద్యాలయాల్లో వసతుల కల్పనకు గాను ప్రభుత్వం రూ.6 కోట్ల నిధులు మంజూరు చేసిందన్నారు. జఫర్‌గఢ్‌లోని కస్తూర్బా, ఆదర్శ పాఠశాలలో నెలకొన్న సమస్యల పరిష్కారానికి నిధులు మంజూరు చేస్తానని, ఇందుకు అంచనా ప్రతిపాదనలు పంపించాలని అధికారులను ఆదేశించారు. కాగా, వికలాంగుల కాలనీలో సమస్యలు పరిష్కరించాలని కాలనీ వాసులు ఎమ్మెల్యే కడియం శ్రీహరికి విన్నవిస్తూ వినతి పత్రం అందించారు.

ఈ కార్యక్రమాల్లో మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ లావణ్యరెడ్డి, వైస్ చైర్మన్ నూకల అయిలయ్య, జఫర్‌గఢ్ సొసైటీ చైర్మన్ తీగల కరుణాకర్‌రావు, ఎంపీడీవో సుమన్, తహసీల్దార్ రాజేశ్‌రెడ్డి, మోడల్ స్కూల్, కస్తూర్బా ప్రిన్సిపాల్స్ డాక్టర్ శ్రీకాంత్, స్వప్న, వివిధ శాఖల అధికారులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, విద్యార్థులు పాల్గొన్నారు.

మోడల్ స్కూల్, కేజీబీవీకి సీసీ రోడ్డు మంజూరు

స్టేషన్‌ఘన్‌పూర్ టౌన్(ఆంధ్రజ్యోతి): స్టేషన్ ఘన్‌పూర్ మోడల్ స్కూల్‌కు రోడ్డు సౌకర్యం సరిగా లేదని ఈనెల 17న ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనానికి ఎమ్మెల్యే కడియం శ్రీహరి, ఎంపీ కడియం కావ్య స్పందించారు. బుధవారం రూ.28 లక్షల వ్యయంతో మోడల్ స్కూల్‌తో పాటు ఆ తర్వాత అదే దారిలో ఉన్న కేజీబీవీకి కూడా సీసీ రోడ్డు నిర్మాణానికి వారు శంకుస్థాపన చేశారు. దశాబ్ద కాలంగా సరైన రోడ్డు వసతి లేక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని గమనించి వెంటనే నిధులు మంజూరు చేయడం పట్ల పలువురు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మోడల్ స్కూల్, కేజీబీవీ విద్యార్థులు, ఏపీసీ చైర్మన్‌లు, సిబ్బంది ఎమ్మెల్యే, ఎంపీలకు కృతజ్ఞతలు తెలిపారు.

ప్రజల పక్షాన పోరాడేది ఎర్రజెండా పార్టీలే..

సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాసరావు



మాట్లాడుతున్న తక్కళ్లపల్లి శ్రీనివాసరావు

కృష్ణకాలనీ, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): ప్రజల పక్షాన పోరాడేది ఎర్రజెండా పార్టీలేనని సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాసరావు అన్నారు. సీపీఐ చేపట్టిన బస్సు జాతా బుధవారం భూపాలపల్లికి చేరుకుంది. అంబేద్కర్ కూడలిలో వద్ద రాత్రి ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. వంద సంవతరాలు ప్రజల పక్షాన సీపీఐ నిరంతరం పోరాటాలు చేసిందన్నారు. కమ్యూనిస్టులంతా ఒకే వేదికపై ఉద్యమిచాల్సిన అవసరం ఉందన్నారు. దేశంలో మతతత్వ బీజేపీ 12 సంవత్సరాలు అధికారంలో ఉండి ఆపరేషన్ కగార్ పేరుతో మావోయిస్టులను ఎన్‌కౌంటర్ చేస్తోందని మండిపడ్డారు.

ఈ కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కలవేణి శంకర్, డీహెచ్‌పీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అనిల్‌కుమార్, ఏఐఎస్‌ఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు మణికంఠరెడ్డి, సీపీఐ జిల్లా కార్యదర్శి రాజ్‌కుమార్, నాయకులు సోత్కు ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

ఆటో డ్రైవర్ ఆత్మహత్య

ఏటూరునాగారం, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): మద్యానికి బానిసై, భార్య మందలించడంతో తీవ్ర మనస్తాపానికి గురైన ఓ ఆటో డ్రైవర్ ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన ములుగు జిల్లా ఏటూరునాగారంలో బుధవారం చోటుచేసుకుంది. ట్రెయినీ ఎస్సై నరేష్ తెలిపిన వివరాల ప్రకారం.. ఏటూరునాగారం మండల కేంద్రానికి చెందిన చీరల శ్రీనివాస్(35) ఆకులవారిఘణపురం విద్యుత్ సబ్ స్టేషన్ సమీపాన నివాసముంటూ ఆటో నడుపుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. కొంతకాలంగా మద్యానికి బానిసయ్యాడు. దీంతో మద్యం మానేయాలని భార్య మందలించేది. బుధవారం కూడా మద్యం తాగిన మత్తులో ఉన్న శ్రీనివాస్.. భార్య మాటలను జీర్ణించుకోలేక జంపన్నవాగు సమీపంలో చెట్టుకు ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి తల్లి చీర్ల స్వరూప ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. మృతుడికి భార్య, ఇద్దరు కూతుర్లు, ఒక కొడుకు ఉన్నారు.

మత్స్యకారుల సమస్యలను పరిష్కరించాలి

జఫర్‌గఢ్ మత్స్య సొసైటీ అధ్యక్షుడు భిక్షపతి



మహాసభల వాల్‌పోస్టర్ల ఆవిష్కరణలో మత్స్య సొసైటీ ప్రతినిధులు

జఫర్‌గఢ్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): మత్స్యకారుల సమస్యలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పరిష్కరించాలని జఫర్‌గఢ్ మత్స్య సొసైటీ అధ్యక్షుడు అన్నెబోయిన భిక్షపతి, మత్స్యకారుల సంఘం మండల అధ్యక్షుడు నాయిని రామస్వామి, జిల్లా ఉపాధ్యక్షుడు కాట కృష్ణ డిమాండ్ చేశారు. తెలంగాణ మత్స్యకారుల సంఘం మహాసభల వాల్‌పోస్టర్లను బుధవారం జఫర్‌గఢ్‌లో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వృత్తి రక్షణ, మత్స్యకారుల సంక్షేమం కోసం రాబోయే బడ్జెట్‌లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రూ.5వేల కోట్ల నిధులు కేటాయించాలన్నారు.

రాష్ట్ర వ్యాప్తం గా చేపల మార్కెట్‌ల నిర్మాణంతో పాటు ప్రతి మత్స్య సొసైటీకి రూ.10 లక్షల చొప్పున ఆర్థిక సాయం అందించాలన్నారు. ప్రతి జిల్లాలో చేపపిల్లల ఉత్పత్తి కేంద్రాలను ఏర్పాటు చేయాలని, జలవనరుల భూముల్లో సేద్యం చేసుకునే హక్కులు స్థానిక మత్స్య సొసైటీలకే చెందేలా రాష్ట్ర ప్రభుత్వం చట్టం చేయాలన్నారు. ఈ నెల 25న కరీంనగర్‌లో భారీ ఎత్తున నిర్వహించే మత్స్యకారుల సంఘం రాష్ట్ర స్థాయి 4వ మహాసభలకు మత్స్యకారులు అధిక సంఖ్యలో తరలిరావాలని వారు కోరారు. కార్యక్రమంలో సొసైటీ డైరెక్టర్లు సీహెచ్.సోమనర్సయ్య, బాషబోయిన సుధాకర్, ప్రతినిధులు నీలం రమేశ్, బాషబోయిన నరేశ్, కాట శ్రీను తదితరులు పాల్గొన్నారు.

హత్య కేసులో నిందితుడికి జైలుశిక్ష



నిందితుడు దయానంద్‌తో పోలీసులు

గోవిందరావుపేట, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): హత్య కేసులో కోర్టు ట్రయల్స్‌కు హాజరు కాకుండా తప్పించుకుతిరుగుతున్న నిందితుడికి ములుగు జిల్లా సెషన్ కోర్టు జడ్జి జైలు శిక్ష విధించారు. ఈ మేరకు పస్రా ఎస్సై అచ్చ కమలాకర్ తెలిపారు. పస్రా పోలీస్‌స్టేషన్ పరిధిలో ఐదేళ్లక్రితం జరిగిన హత్య కేసులో దయానంద్ అలియాస్ దయ నిందితుడు. కోర్టులో కేసు నడుస్తుండగా దయానంద్ ఏడు నెలలుగా ట్రయల్స్‌కు హాజరు కాకుండా తప్పించుకుతిరుగుతున్నాడని అన్నారు. అతనికి ఎన్‌బీడబ్ల్యూ వారెంట్ జారీ చేయగా తమ సిబ్బంది బెంగళూరులో ఉన్న దయానంద్‌ను పట్టుకుని బుధవారం కోర్టులో హాజరుపరచగా సెషన్‌కోర్టు జడ్జి జైలుశిక్ష విధించినట్లు ఎస్సై పేర్కొన్నారు. నిందితుడిని కోర్టులో హాజరుపరిచేం దుకు కృషిచేసిన ఎస్సై కమలాకర్, కోర్టు కానిస్టేబుళ్లు, సిబ్బందిని డీఎస్పీ రవీందర్ అభినందించారు.

వరంగల్ మార్కెట్ ధరలు

(రూ. వేలల్లో)

పంట	క్వింటా గరిష్ఠం	క్వింటా కనిష్ఠం
పత్తి	6830	6300
మక్కలు	1760	1521
కందులు	5852	3022
పెసళ్లు	3850	3022
పల్లికాయ (సూక)	4500	3500
పల్లికాయ (పచ్చిది)	6221	3890
పసుపు (కాడి)	----	----
పసుపు (గోల)	----	----
తేజ మిర్చి	----	----
తేజ మిర్చి ఏసీ	15150	9500
వండర్‌హాట్	----	----
వండర్‌హాట్ ఏసీ	20000	12000
యూఎస్341ఏసీ	18500	9000
దీపిక	----	----
సింగిల్‌పట్టి ఏసీ	----	----
తాలు మిర్చి	6000	4000

- వరంగల్ వ్యవసాయం

ఎస్సీ గురుకులాలపై ప్రత్యేక శ్రద్ధ

- సమస్యల పరిష్కారంపై దృష్టి
- జిల్లాకు ఒక సమన్వయ అధికారి నియామకం
- అదనంగా జోనల్ అధికారుల భర్తీ
- ఉద్యోగులకు త్వరలో పదోన్నతులు
- 'ఆంధ్రజ్యోతి' వార్తకు స్పందన



హనుమకొండ, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యా సంస్థల (టీజీఎస్‌డబ్ల్యూఆర్)పై రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది. ఈ పాఠశాలల్లో పేరుకు పోయిన సమస్యలను పరిష్కరించే దిశగా దృష్టి సారించింది. ఇందులో భాగంగా వీటి పర్యవేక్షణకు 33 జిల్లాలకు సమన్వయాధికారులను నియమించింది. ఇందులో భాగంగా ఉమ్మడి వరంగల్ జిల్లాలో కొత్తగా ఆరుగురు కోఆర్డినేటర్లు నియమితులయ్యారు. అలాగే గురుకులాల నిర్వహణను మరింత మెరుగు పరిచేందుకు, బోధనా ప్రమాణాల మెరుగు, సౌకర్యాల కల్పనకు తీసుకోవాల్సిన చర్యలపై మార్గదర్శనం చేయడానికి మొదటిసారిగా జోనల్, మల్టీ జోనల్ అధికారులనూ నియమించింది. ఈ మేరకు సొసైటీ సెక్రటరీ కృష్ణ ఆదిత్య ఉత్తర్వులు జారీ చేశారు. ఈనెల 5న గురుకులాల్లో పదోన్నతుల్లో జాప్యం పేరుతో 'ఆంధ్రజ్యోతి'లో వచ్చిన కథనానికి స్పందించిన ప్రభుత్వం ఈ దిశగా చర్యలు తీసుకోవడం మొదలు పెట్టింది.

త్వరలో పదోన్నతులు

టీజీ ఎస్‌డబ్ల్యూఆర్ విద్యా సంస్థల్లో అన్ని స్థాయిల్లో పదోన్నతులు లేక ఉద్యోగులు తీవ్ర మనోవేదనకు గురవుతున్న అంశంపై కూడా ప్రభుత్వం దృష్టి సారించింది. పదోన్నతుల్లో జాప్యం వల్ల వారు సర్వీస్, ఆర్థికంగానూ నష్టపోతున్నారు. అనేక సంవత్సరాలుగా పదోన్నతులు లేక గురుకులాల్లో విద్య గాడి తప్పుతోంది. గురుకులాల్లో 1,650 పదోన్నతులు పెండింగ్‌లో ఉన్నాయి. ఉమ్మడి జిల్లాలో 250 నుంచి 300 మంది ఉద్యోగులకు పదోన్నతులు రావాల్సి ఉంది. క్రింది స్థాయిలో పదోన్నతులను పట్టించుకోవడం లేదన్న విషయాన్ని గుర్తించిన ప్రభుత్వం త్వరలోనే ఈ దిశగా చర్యలు తీసుకునేందుకు కసరత్తు చేస్తున్నట్లు తెలుస్తోంది.

ఉమ్మడి జిల్లాలో కో-ఆర్డినేటర్లు

ఇందులో భాగంగా భూపాలపల్లి జిల్లాకు గ్రేడ్-2 ప్రిన్సిపాల్ జి రజనిని, ములుగు జిల్లాకు గ్రేడ్-1 ప్రిన్సిపాల్ ఎ. వెంకటేశ్వర్లు మహబూబాబాద్ జిల్లాకు గ్రేడ్-1 ప్రిన్సిపాల్ బి జాక్విలిన్, హనుమకొండ జిల్లాకు గ్రేడ్-1 ప్రిన్సిపాల్ డి ఉమామహేశ్వరి, వరంగల్ జిల్లాకు గ్రేడ్-1 ప్రిన్సిపాల్ పి. అపర్ణను జనగామ జిల్లాకు గ్రేడ్-1 ప్రిన్సిపాల్ పి. శ్రీనివాసరావు నియమించింది. ఇంతకు ముందు ఇన్‌చార్జిలుగా ఉన్నవారి స్థానంలోనే సీనియారిటీ ప్రకారం వీరి నియామకాలు జరిగాయి.

విధులు, బాధ్యతలు

ఈ గురుకుల విద్యా సంస్థల్లో 5 నుంచి ఇంటర్ వరకు జరిగే ప్రవేశాలను ఈ జిల్లా కో-ఆర్డినేటర్లు పర్యవేక్షిస్తారు. పరీక్షల నిర్వహణ, పాఠ్యపుస్తకాల పంపిణీ, ఉత్తమ ఉపాధ్యాయుల గుర్తింపు, విద్యార్థులకు నాణ్యమైన బోధన, ఉపాధ్యాయుల బోధనా తీరు, అవసరాన్ని బట్టి ఆయా పాఠశాలల్లో పార్ట్‌టైమ్ ఉపాధ్యాయుల నియామకం, ఎస్‌ఏ, ఎఫ్‌ఏ పరీక్షల తర్వాత విద్యార్థుల ప్రతిభా పాటవాల విశ్లేషణ తదితర విధులు నిర్వర్తిస్తారు. గురుకుల విద్యా సంస్థల నిర్వహణపై ప్రత్యేకంగా దృష్టి పెడతారు. పాఠశాలల్లో మౌలిక సదుపాయాల కల్పనకు సంబంధించిన వివిధ పనులు చేపట్టడానికి టెండర్ల ప్రక్రియను వేగవంతం చేస్తారు.

జోనల్, మల్టీ జోనల్ అధికారులు

ఈ గురుకులాలను మరింత సమర్థవంతంగా నిర్వహించేందుకు, జిల్లా సమన్వయకర్తలతో ఎప్పటికప్పుడు చర్చించడం ద్వారా సమస్యల సత్వర పరిష్కారం దిశగా తీసుకునే చర్యల్లో భాగంగా ప్రస్తుతం ఉన్న ప్రాంతీయ కో-ఆర్డినేటర్ల స్థానంలోనే జోన్లు, మల్టీ జోన్ల వారిగా జోనల్ అధికారులను నియమించారు. రాష్ట్రవ్యాప్తంగా మొత్తం పది మంది జోనల్ అధికారుల నియామకం జరిగింది. హైదరాబాద్‌లోనిటీజీఎస్‌డబ్ల్యూఆర్ కేంద్ర కార్యాలయంలో ఇన్‌చార్జి అధికారిగా (జోన్-7) కె.నిర్మల, మల్టీజోన్ -1కు కె.అరుణ కుమారి, మల్టీ జోన్ -2కు ఎస్ రజిని, జోన్ -1కు చెంచు గిరిజ, జోన్ -2కు ఎస్ యుగంధర్ లక్ష్మీ, జోన్-3కి కె ప్రత్యూశ, జోన్-4కు కె అలివేలు, జోన్-5కు ఎస్ విద్యారాణి, జోన్-6కు వి లక్ష్మాంజలిదేవి, జోన్-7కు కె.విద్యుల్లత నియమితులయ్యారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న 268 సంక్షేమ గురుకుల విద్యాలయాలను వీరు పర్యవేక్షిస్తారు.

విధులు, బాధ్యతలు

గురుకుల విద్యా సంస్థల బోధన, బోధనేతర సిబ్బందికి శిక్షణ, వర్క్‌షాపులు, నిర్వహణ, విద్యార్థులకు మెగా ఎంసెట్ వంటి క్యాంపులు, స్టార్ బ్యాచ్ వంటి ఇతర కోచింగ్ శిబిరాలు నిర్వహణ, విద్యా సంస్థల తనఖీ, ప్రశ్నపత్రాల పంపిణీ, విద్యా బోధన, సిలబస్ పూర్తి తదితర అంశాలపై ఎప్పటికప్పుడు ప్రిన్సిపాళ్లు, ఉపాధ్యాయులతో టెలీ కాన్ఫరెన్స్‌లు, ఇతరత్రా సమావేశాల నిర్వహణ తదితర బాధ్యతలను నిర్వర్తిస్తారు.



జిల్లా సమన్వయకర్తలు

సాంఘిక గురుకులాల్లో చాలా వాటికి పూర్తిస్థాయి ప్రిన్సిపాళ్లు లేరు. సుమారు 140 గురుకులాలు ఇన్‌చార్జి ప్రిన్సిపాళ్ల ఆధ్వర్యంలో నడుస్తున్నాయి. సీనియారిటీని పరిగణలోకి తీసుకోకుండా అనుభవం లేని వారిని ఇన్‌చార్జిలుగా నియమించడంతో గురుకులాల నిర్వహణ గాడి తప్పుతోంది. అవినీతి, అక్రమాలు చోటు చేసుకుంటున్నాయి. ఇన్‌చార్జి ప్రిన్సిపాళ్లలో చాలా మంది పలుకుబడి, పైరవీలతో వచ్చినవారేననే విమర్శలున్నాయి. దీంతో గురుకులాల్లో పాలన ఇష్టారాజ్యంగా నడుస్తోందనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. జోనల్ అధికారులు, జాయింట్ సెక్రటరీ, డిప్యూటీ సెక్రటరీ స్థాయిల్లో పదవీ విరమణలు, కొందరు వీఆర్ఎస్ తీసుకోవడం వల్ల దాదాపు పది పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఈ లోపాన్ని సరిదిద్దేందుకు ముందుగా జిల్లా సమన్వయకర్తల నియామకాన్ని ప్రభుత్వం చేపట్టింది.

విద్య, నిర్వహణ మెరుగుపడుతుంది..
రెసిడెన్షియల్ ఎంప్లాయీస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు అలగోని నరసింహులు గౌడ్

టీజీఎస్‌డబ్ల్యూఆర్ విద్యా సంస్థల్లో విద్యాప్రమాణాలు, పరిపాలన మెరుగుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటున్నందుకు ధన్యవాదాలు. ఇందులో భాగంగా సీనియర్ ప్రిన్సిపాళ్లను జిల్లా కో-ఆర్డినేటర్లు, జోనల్ స్థాయిలో రీజనల్ ఇన్‌చార్జిల స్థానంలోనే జోనల్, మల్టీ జోనల్ అధికారులను నియమించడం పట్ల సంతోషం. వీటితో పాటు రాష్ట్రవ్యాప్తంగా చాలా కాలంగా పెండింగ్‌లో ఉన్న 1,650 పదోన్నతులను వెంటనే చేపట్టాలి. దీని వల్ల గిరిజనులు, దళితులు, వెనుకబడిన తరగతుల విద్యార్థులు ఎక్కువగా చదువుకునే గురుకులాలు విద్య, నిర్వహణ మెరుగుపడి మంచి ఫలితాలు వస్తాయి.



సమావేశంలో మాట్లాడుతున్న చక్రపాణి

రోడ్డు భద్రతపై వరంగల్ డిక్లరేషన్

సదస్సులో 5 తీర్మానాలు ఆమోదం

హనుమకొండ, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదాలు నిత్య కృత్యంగా మారాయి. ప్రతీరోజు ఏదో ఒక చోట రోడ్డు ప్రమాదం జరిగి ప్రయాణికులు మృత్యువాతపడుతున్నారు. పలువురు గాయాల పాలవుతున్నారు. ఇటీవలకాలంలో రోడ్డు ప్రమాదాలు మరింతగా పెరిగాయి. హనుమకొండలోని అశోకా హోటల్లో రోడ్డు ప్రమాదాలపై జరిగిన జాతీయ సదస్సులో రోడ్డు ప్రమాదాలకు గల కారణాలు, నివారణకు తీసుకోవలసిన చర్యలపై లోతుగా చర్చించారు. ఈ సదస్సుల్లో మొత్తం 5 తీర్మానాలను ఆమోదించారు. రోడ్డు భద్రతపై వరంగల్ డిక్లరేషన్ పేరుతో బుధవారం ఈ తీర్మానాలను వినియోగదారుల మండలి జాతీయ ప్రదాన కార్యదర్శి సాంబరాజు చక్రపాణి విడుదల చేశారు. జిల్లా ట్రాన్స్‌పోర్టు అథారిటీ, లీగల్ మెట్రాలజీ, మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు పాల్గొన్న ఈ సదస్సులో లోతుగా చర్చించి ఈ తీర్మానాలను చేశారు. వీటిని అమలు చేయాల్సిన ఆవశ్యకతను నొక్కి చెప్పారు.

రోడ్డు ప్రమాదాలకు నాలుగు ముఖ్య కారణాలను సదస్సులో గుర్తించారు. లోపభూయిష్టమైన రోడ్లు, లోపాలతో కూడిన వాహనాలు, డ్రైవర్ల నిర్లక్ష్యం, రోడ్ల గజిబిజి, అధ్వాన్న స్థితి వీటిలో ఉన్నాయి. తరుచూ రోడ్డు ప్రమాదాలు జరగడానికి రోడ్ల డిజైనింగ్‌లో లోపాలు, రోడ్లపై గుంతలు, ఫుట్‌పాత్‌లు లేకపోవడం, డెత్ స్పాట్స్‌ను తొలగించకపోవడం, స్మార్ట్ రోడ్ల పేరిట అధికారులు అవినీతి కారణాలుగా పేర్కొన్నారు. లారీలు, కార్లు, మోటారు సైకిళ్ల తయారీలో లోపాలు, వాహనాలలోని అన్ని రకాల విడిభాగాల తయారీలో బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్ నిర్దేశించిన ప్రమాణాలు పాటించకపోవడం, బ్రేక్ టైరాడ్లలో పగుళ్లు, లూజ్ స్టీరింగ్, నాణ్యతగా లేని టైర్లు కూడా రోడ్డు ప్రమాదాలకు హేతువు అవుతున్నాయని తీర్మానంలో పేర్కొన్నారు. స్పీడ్ డ్రైవింగ్, అనుమతి లేని చోట పార్కింగ్, సిగ్నలింగ్ గమనించకపోవడం, డ్రైవర్లకు సరైన నిద్ర లేకపోవడం, మద్యం సేవించి డ్రైవింగ్ చేయడం తదితర కారణాలు కూడా రోడ్డు ప్రమాదాలకు కారణాలు అవుతున్నాయని విశ్లేంచారు. రోడ్డుపై ఎద్దుల బండ్లు, సైకిళ్లు, ఆటో రిక్షాలు, కుక్కలు, పాదచారులు, స్కూల్ పిల్లల ప్రయాణం విషయంలో తగిన జాగ్రత్తలు తీసుకోకపోవడం వల్ల కూడా ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయని తీర్మానించారు. ఉమ్మడి వరంగల్ జిల్లాకు సంబంధించి 90 శాతం రోడ్డు ప్రమాదాలు రోడ్డు భవనాల శాఖ, మున్సిపల్ కార్పొరేషన్ అధికారుల నిర్లక్ష్యంగా పేర్కొన్నారు. వరంగల్‌లో 10, హనుమకొండలో 14 డెత్ స్పాట్లను గుర్తించినా వాటికి సరిచేయకపోవడం పట్ల సదస్సు విచారం వ్యక్తం చేసింది. వరంగల్-ఖమ్మం జాతీయ రహదారి 563 నిర్వహణలో ఆ శాఖ అధికారుల వైఫల్యం కొట్టొచ్చినట్లు కనిపిస్తోందని నిరసించింది. రోడ్డు భద్రతపై వరంగల్ డిక్లరేషన్ పేరుతో ఆమోదించిన ఈ తీర్మానాలను సంబంధిత శాఖల అధికారులకు అందజేయడం ద్వారా వాటి అమలుకు కృషి చేయాలని సదస్సులో నిర్ణయించారు. రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రజల్లో అవగాహన కల్పించడానికి విస్తృత స్థాయిలో చైతన్య కార్యాక్రమాలను నిర్వహించాలని కూడా సదస్సు నిర్ణయించింది.

మహిళలందరికీ ఇందిరమ్మ చీరలు

- పంపిణీకి అధికారుల ఏర్పాట్లు
- మార్చిలో మెప్మా సంఘాల సభ్యులకు..

హనుమకొండ, నవంబరు 19 (ఆంధ్ర జ్యోతి) తెల్లరేషన్ కార్డు కలిగిన మహిళలందరికీ ఇందిరమ్మ చీరల పంపిణీకి రంగం సిద్ధమైంది. బుధవారం హైదరాబాద్‌లో సీఎం రేవంత్ రెడ్డి చీరల పంపిణీని లాంఛనంగా ప్రారంభించారు. దీంతో గురు వారం నుంచి వచ్చే నెల 9వ తేదీ వరకు చీరల పంపిణీ కార్యక్రమం కొనసాగుతుంది. వాస్తవానికి మొదట స్వయం సహా యక సంఘాల (ఎస్‌హెచ్‌జీ) సభ్యులకు మాత్రమే పంపిణీ చేయాలని ప్రభు త్వం భావించింది. ఆ మేరకు వివరాలను తీసుకొని చీరల స్టాక్‌ను పంపించింది. ఆ మేరకు జిల్లాకు 2.80లక్షల చీరల వచ్చాయి. వీటిని వరంగల్ ఏనుమాముల గోదాములో భద్రపరిచారు. కాగా, బుధవారం చీరల పంపిణీ కార్యక్రమం ప్రారం భం సందర్భంగా కోటి మంది మహిళలకు ఇందిరమ్మ చీరలను పంపిణీ చేయ నున్నట్టు ప్రకటించారు. దీంతో ఎస్‌హెచ్‌జీ సభ్యులతో పాటు తెల్లరేషన్ కార్డు కలిగిన 18 ఏళ్ల వయసు దాటిన మహిళలకు కూడా చీరల పంపిణీ జరగను న్నట్టు స్పష్టమైంది. ఈ లెక్కన ప్రస్తుతం జిల్లాకు చేరిన 2.80 లక్షల చీరలతో పాటు మరో 20 నుంచి 30వేల చీరలు అదనంగా కావలసి ఉంది. అయితే ఈ అదనపు చీరలను మెప్మా సభ్యుల కోసం ఇప్పటికే పంపిన లక్షా 71వేల చీరల నుంచి వాడుకోనున్నారు. మెప్మా సభ్యులకు మాత్రం ఇప్పుడు కాకుండా వచ్చే యే డు మార్చి 1న చీరలను పంపిణీ చేయాలని ప్రభుత్వ నిర్ణయించింది. ఈ మేరకు అధికారులకు ప్రభుత్వం మార్గదర్శకాలను జారీ చేసింది. చీరల పంపిణీ గురువా రం నుంచి పంపిణీ చేయాల్సి ఉన్నది. అది మంత్రులు, ఎమ్మెల్యేల అందుబాటు ను బట్టి ఉంటుంది. సభలను, సమావేశాలను ఏర్పాటుచేసి వారి ద్వారానే చీరలను పంపిణీ చేయాలని ప్రభుత్వం స్పష్టం చేసింది. ఈ మేరకు డీఆర్‌డీవో అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. డిసెంబర్ 9వలోగా చీరల పంపిణీ కార్యక్రమాన్ని పూర్తి చేయాల్సి ఉంది.

మార్చిలోపు కోచ్ ఫ్యాక్టరీ నిర్మాణం పూర్తి

- వరంగల్ ఎంపీ కడియం కావ్య
- కోచ్ ఫ్యాక్టరీని సందర్శించిన ఎంపీ, ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు
- రైల్వే అధికారులతో ప్రత్యేక సమావేశం


రైల్వే అధికారుల సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ కడియం కావ్య

కాజీపేట, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): వచ్చే ఏడాది మార్చిలోపు రైల్వే కోచ్‌ఫ్యాక్టరీ నిర్మాణం పూర్తవుతుందని, అందుకు రైల్వే అధికారులు అన్ని చర్యలు చేపడుతున్నారని వరంగల్ ఎంపీ కడియం కావ్య తెలిపారు. కాజీపేట అయోధ్యపురం సమీపంలోని రైల్వే కోచ్‌ఫ్యాక్టరీని బుధవారం వరంగల్ ఎంపీ కడియం కావ్య, వర్ధన్నపేట ఎమ్మెల్యే నాగరాజు సందర్శించారు. రైల్వే ఉన్నతాధికారులతో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. అనంతరం ఎంపీ కడియం కావ్య, ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు మీడియాతో మాట్లాడారు. కోచ్‌ఫ్యాక్టరీ నిర్మాణం, పెండింగ్ పనులు, విదేశాల నుంచి తీసుకువచ్చే మిషనరీల గురించి రైల్వే అధికారులతో చర్చించినట్లు చెప్పారు. మార్చిలోపు అన్ని పనులు పూర్తయి ఫ్యాక్టరీ నుంచి వ్యాగన్‌ల ఉత్పత్తి ప్రారంభించనున్నట్లు తెలిపారు. ముఖ్యంగా కోచ్‌ఫ్యాక్టరీ నిర్మాణంలో భూములు కోల్పోయిన రైతుల కుటుంబీకులకు రైల్వేలో ఉద్యోగావకాశాలు కల్పించేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నామని అన్నారు. దేశంలో ఇతర రాష్ట్రాల్లో నిర్మించిన కోచ్‌ఫ్యాక్టరీలో స్థానికులకు ప్రత్యేక కోటాలో ఉద్యోగాల భర్తీ ఎలా చేశారో.. అదేవిధంగా అయోధ్యపురం రైతులకు, స్థానికులకు ఉద్యోగాలు భర్తీ చేసేందుకు ప్రత్యేక ప్రణాళికలు చేస్తున్నామని చెప్పారు. ఔట్ సోర్సింగ్, శాశ్వత ఉద్యోగాల భర్తీ చేసేందుకు కేంద్ర రైల్వే మంత్రిని, ప్రధాని మోదీని కలుస్తామన్నారు.. కాజీపేటకు రైల్వే డివిజన్ హోదా కోసం పార్లమెంట్‌లో లేవనెత్తి డివిజన్ సాధించి తీరుతామన్నారు.

300 ఎకరాల్లో డిపో కోసం స్థల పరిశీలన

దక్షిణ మధ్య రైల్వే జోన్‌పరిధిలో 300 ఎకరాల్లో మెగా మెయింటనెన్స్ డిపో నిర్మాణం చేసేందుకు రైల్వే అధికారులు ప్రణాళికలు చేస్తున్నట్లు ఎంపీ కడియం కావ్య చెప్పారు. ఈ మెగా డిపోలో సరుకు రవాణా చేసే రైళ్లకు పీరియాడికల్, రెగ్యులర్ ఓవరాలింగ్, వ్యాగన్‌ల మరమ్మతుల నిర్వహణ లాంటి ప్రధాన కార్యకలాపాలు నిర్వహిస్తారని చెప్పారు. ఈ ప్రాజెక్ట్ నిర్మాణం కోసం స్టేషన్‌ఘన్‌పూర్ - కాజీపేట రైల్వే స్టేషన్‌ల మధ్య స్థలపరిశీలన చేస్తున్నామని చెప్పారు. ఈ ప్రాజెక్ట్‌కు ట్రాక్ కనెక్టివిటీ ఉండాల్సిన అవసరం ఉందన్నారు. ట్రాక్ కనెక్టివిటీ ఉన్న ప్రైవేట్ స్థలాలు రేట్లు విపరీతంగా ఉండటంతో స్థల సమస్య ఎదురవుతుందన్నారు. రూ.908 కోట్లతో నిర్మించే ఈ ప్రాజెక్ట్ నిర్మాణంపై త్వరలో ఒక స్పష్టత రానుందని చెప్పారు. అనంతరం కోచ్‌ఫ్యాక్టరీ మొత్తాన్ని ఎంపీ కడియం కావ్య, ఎమ్మెల్యే నాగరాజుల, రైల్వే అధికారులు పరిశీలించారు. కడియం కావ్య వెంట రై ల్వే సీఎంఈ ఆనంద్, జీజీఎం మురళీకృష్ణ, డీజీఎం శర్మ, మెట్టుగుట్ట చైర్మన్ పైడిపాల రఘుచందర్, కాజీపేట మండల కాంగ్రెస్ అధ్యక్షుడు సారం పల్లి శ్రీనివాస్ రెడ్డి, కడిపికొండ గ్రామ శాఖ అధ్యక్షుడు కట్కూరి రమేశ్, 45, 46 డివిజన్‌ల అధ్యక్షుడు వస్కుల నాగరాజు, సట్ల సదానందంతో పాటు స్థానిక కాంగ్రెస్ నాయకులు ఉన్నారు. ఈ సందర్భంగా అయోధ్యపురం రైతులు రైల్వే కోచ్‌ఫ్యాక్టరీలో ఉద్యోగాలు కల్పించాలని కోరుతూ ఎంపీ కడియం కావ్యకు, ఎమ్మెల్యే కేఆర్ నాగరాజుకు వినతిపత్రం సమర్పించారు.

ప్రమాద ఘంటికలు

- ఉమ్మడి జిల్లాలో పెరుగుతున్న రోడ్డు ప్రమాదాలు
- రక్తసిక్తమవుతున్న ప్రధాన రహదారులు
- బాధిత కుటుంబాల్లో తీరని విషాదఛాయలు
- నిబంధనలు పాటించాలంటున్న పోలీసు, ఆర్టీఏ అధికారులు


పర్వతగిరి పీఎస్ పరిధిలోని ఏనుగల్లులో బోల్తా పడిన కారు (ఫైల్)

వరంగల్ క్రైం, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి వరంగల్ వ్యాప్తంగా కొద్ది రోజులుగా రోడ్డు ప్రమాదాలు పెరిగిపోతున్నాయి. దీంతో వాహనదారులు, రోడ్డుకు ఇరువైపులా నివసించే కుటుంబాలు ఆందోళన చెందుతున్నారు. నిర్లక్ష్య డ్రైవింగ్, అతి వేగంతో ప్రాణాలు కోల్పోవడమే కాకుండా ఇతరుల ప్రాణాలను బలి చేస్తూ ఆయా కుటుంబాల్లో శోకాన్ని మిగిల్చుతున్నారు. కొన్ని సందర్భాల్లో లారీ డ్రైవర్లు నిద్రలేకనో, మద్యం మత్తులోనే రోడ్డు పక్కనే ఉండే ఇళ్లలోకి దూసుకెళుతూ ఆస్తి నష్టంతో పాటు ప్రాణ నష్టం చేస్తున్నారు. అయితే ప్రమాదాలన్నింటికీ రోడ్డు భద్రతా నిబంధనల పాటించకపోవడమే కారణమని పోలీస్‌శాఖతో పాటు రవాణాశాఖ అధికారులు వెల్లడిస్తున్నారు.

సెల్‌ఫోన్, మద్యం, నిర్లక్ష్యంతో ప్రమాదాలు

డ్రైవింగ్ సమయంలో వాహనదారులు సెల్‌ఫోన్ మాట్లాడటం, మద్యం సేవించడం, అతి వేగంతోనే ప్రమాదాలకు గురవుతున్నట్లుగా అధికారుల దర్యాప్తులో వెలుగు చూస్తున్నాయి. ట్రాలీ, లారీ డ్రైవర్లతో పాటు ఇతర డ్రైవర్లు జాతీయ రహదారుల పక్కకు ఉన్న వైన్స్ షాపుల్లో మద్యం తాగి గూడ్స్ వాహనాలు నడుపుతుండటంతో ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. ప్రసుత్త వాతావరణంలోని మార్పులతో పొగ మంచు పెరిగిన కారణంగా వాహనదారులు జాగ్రత్తలు తీసుకోకపోతే ప్రమాదాలు మరింతగా పెరిగే అవకాశం ఉంటుందని రవాణాశాఖ అధికారులు చెబుతున్నారు.

మానవ తప్పిదాలతోనే ప్రమాదాలు
ఉమ్మడి జిల్లా రవాణాశాఖ డీటీసీ జి. సురేశ్‌రెడ్డి



రోడ్డు ప్రమాదాలు అత్యధికంగా మానవ తప్పిదాలతోనే జరుగుతున్నాయి. మద్యం, నిర్లక్ష్యం, అతి వేగం, ఓవర్‌లోడ్, సెల్‌ఫోన్ డ్రైవింగ్ చేస్తూ వాహనదారులు ప్రమదాలకు గురవుతున్నారు. రోడ్డు నిబంధనల అమలు బాధ్యతను అధికారులకు వదిలేయకుండా రోడ్డుపై ప్రయాణించే ప్రతి ఒక్కరూ బాధ్యతతో వ్యవహరించాలి. నిబంధనల ఉల్లంఘలను నివారించేందుకు ఎన్‌ఫోర్స్‌మెంట్ సిబ్బంది నిత్యం రోడ్లపై తనిఖీలు నిర్వహించి జరిమానాలు విధిస్తాం, అవగాహన కల్పిస్తాం. స్వీయ జాగ్రత్తలు పాటిస్తే ప్రమాదాలను నివారించొచ్చు.

ఇటీవల జరిగిన ప్రమాదాలు

- ఈ నెల 7న పర్వతగిరి పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఏనుగల్లు వద్ద మహబూబాబాద్ జిల్లా గూడూరు మండలానికి చెందిన సాహెల్ (23) కారులో ప్రయాణిస్తుండగా గుర్తు తెలియని వాహనం ఢీకొని మరణించాడు.
- ఈ నెల 13న ఆత్మకూరు మండలంలోని కొత్తగట్టు సింగారం వద్ద పరకాల నుంచి వరంగల్‌కు కారులో వస్తున్న నలుగురు వ్యక్తులు అతి వేగంగా కారును చెట్టుకు ఢీకొట్టగా వెనుక సీటులో ఉన్న రేగొండ మండల రేపాకు చెందిన పార్ష సంపత్, పరకాల మండల నాగారం గ్రామానికి చెందిన కిషన్‌రావు మరణించగా, ముందు సీటులో కూర్చున్న వెంకటేశ్, మురళికి తీవ్రగాయాలైనాయి.
- మహబూబాబాద్ జిల్లా శనిగరం శివారులో కుమ్మకుంట్ల తండా వద్ద ప్రభుత్వ ఉపాధ్యాయులతో వెళ్తున్న ఆటోను ఇసుక ట్రాక్టర్ ఢీకొట్టగా డ్రైవర్ మల్లేశ్, ప్రభుత్వ ఉపాధ్యాయులు చెన్నబోయిన శోభ, బానోత్ కళావతి, మద్దెల సింధూజ, వెల్పుగొండ శైలజా, నారపాక స్వరూప తీవ్రంగా గాయపడటంలో స్థానిక ఏరియా ఆస్పత్రికి తరలించారు.
- ఈనెల 14న దేవరుప్పల మండలంలోని రంబోజీగూడెంకు చెందిన నక్కిరెడ్డి పూజ (13) 8వ తరగతి చదువుతున్న బాలిక సైకిల్‌పై పాఠశాలకు వెళ్తుండగా ట్రాక్టర్ డ్రైవర్ గుర్రం కుమార్ అతివేగంతో ఢీకొట్టిన ఘటనలో బాలిక మరణించింది.
- ఈ నెల 14న దుగ్గొండి మండలంలోని గిర్నిబావి ప్రధాన దారిపై లారీ ఢీకొని గీసుగొండ మండలం అనంతారం గ్రామానికి చెందిన హనుమాయమ్మ అక్కడికి అక్కడే మరణించింది. జనగామ జిల్లాలోని రఘునాథపల్లి మండలంలోని గోవర్ధనగిరి దర్గా వద్ద ద్విచక్రవాహనాన్ని గుర్తు తెలియని వాహనం ఢీకొనగా వెనుకాల కూర్చున్న వర్ధన్నపేట పరిధిలోని నల్లబెల్లికి చెందిన రాపాక వినోద్ (29) మృతి చెందగా ముందున్న వ్యక్తి గాయపడ్డాడు.

నేటితో కార్తీక మాసం ముగింపు

- రేపటి నుంచి మార్గశిర మాసం
- విశేష పండుగలు, ప్రత్యేక పూజలు

వరంగల్ కల్చరల్, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): నెల రోజుల పాటు పూజలు, అభిషేకాలు, అర్చనలు, వ్రతాలు, వన భోజనాలు, దీపోత్సవాలతో కొనసాగిన కార్తీక మాసం గురువారంతో ముగియనుంది. గురువారం అమావాస్య సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు, కుంకుమ పూజలు కొనసాగుతాయి. ఆధ్యాత్మిక మాసంగా అమావాస్య రోజు గౌరీ నక్తం నిర్వహిస్తారు. పండుగ, పర్వదినాలతో కొనసాగిన కార్తీక మాసంలో కేదారేశ్వర వ్రతాలు, కార్తీక పౌర్ణమి, తులసీ ధాత్రినారాయణ కల్యాణం, ఏకాదశి పర్వదినం నిర్వహించుకున్నారు. దేవాదాయ శాఖ ఆధ్వర్యంలో అన్ని దేవాలయాల్లో ప్రతీ రోజు సాయంత్రం కార్తీక దీపోత్సవాలను నిర్వహించాలని ఆదేశించినప్పటికీ చాలావరకు ఆలయాల్లో నిర్వహించలేదు. కేవలం భద్రకాళి దేవాలయంలో మాత్రమే కార్తీక దీపోత్సవం, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.

- దేవతల మాసంగా..

కార్తీక మాసం ముగిసిన అనంతరం శుక్రవారం నుంచి మార్గశిర మాసం ప్రారంభమవుతుంది. ఈ మాసాన్ని దేవతల మాసంగా పిలుస్తారు. ఈ మాసంలో సుబ్రహ్మణ్యేశ్వర స్వామి షష్ఠి, గీతాజయంతి, మోక్షద ఏకాదశి, దత్తజయంతి, కాలభైరవ అష్టమి, మాస శివరాత్రి వేడుకలు జరుగుతాయి. ఈ మాసంలో నదీ స్నానాలను ఆచరిస్తారు.

వనదేవతలకు ముందస్తు మొక్కులు

10 వేలకు పైగా తరలివచ్చిన భక్తులు

తాడ్వాయి, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): ములుగు జిల్లా తాడ్వాయి మండలం మేడారం వనదేవతలు సమ్మక్క సారలమ్మకు ముందస్తు మొక్కులు చెల్లించుకోవడానికి వివిధ ప్రాంతాల నుంచి భక్తుల బుధవారం అధికంగా తరలివచ్చారు. వనదేవతల సంప్రదాయాల్లో భాగంగా ముందుగా జంపన్న వాగులో పుణ్యస్నానాలు ఆచరించారు. అలాగే కల్యాణ కట్ట వద్ద తలనీలాలు సమర్పించి దేవతల గద్దెలకు చేరుకున్నారు. ఎత్తుబంగారం (బెల్లం), కొబ్బరి కాయలు, చీరెసారె, పసుపు, కుంకుమ సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. సుమారు 10వేల మందికి పైగా భక్తులు తరలి వచ్చినట్లు దేవాదాయ శాఖ అధికారులు తెలిపారు.


వనదేవతలను దర్శించుకుంటున్న భక్తులు

వృద్ధులను గౌరవించాలి

సంక్షేమ శాఖ జిల్లా అధికారి రవి

ములుగు టౌన్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): వృద్ధులను గౌరవించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని సంక్షేమ శాఖ జిల్లా అధికారి తుల రవి అన్నారు. అంతర్జాతీయ వయోవృద్ధుల దినోత్సవం పురస్కరించుకొని ములుగులో బుధవారం ర్యాలీ జరిగింది. ఏరియా ఆస్పత్రి నుంచి కలెక్టర్ కార్యాలయం వరకు ఇది కొనసాగింది. ఈ సందర్భంగా తుల రవి మాట్లాడుతూ వృద్ధుల హక్కులను కాపాడాల్సిన అవసరం ఉందన్నారు.. వారిని ఎవరైనా వేధింపులకు పాల్పడితే కఠిన చర్యలు తప్ప వన్నారు. ఈ కార్యక్రమానికి ముందుగా వైద్యారోగ్య సంక్షేమ జిల్లా శాఖ తరఫున వృద్ధులకు వైద్య శిబిరం నిర్వహించారు. వయోవృద్ధుల సంక్షేమ ఫోరం జిల్లా అధ్యక్షుడు పాశం రామ్మూర్తి, డీసీపీవో ఓంకార్, ఇన్‌చార్జి నాగేంద్ర, ఎఫ్ఆర్‌వో గణేష్, డీఎంసీ రమాదేవి, డీసీపీయూ, సీహెచ్ఎల్, సఖి, డీహెచ్ఈడబ్ల్యూ విభాగాల సిబ్బంది పాల్గొన్నారు.

పేదలకు పట్టాలు ఇవ్వాలి : సీపీఎం


కలెక్టరేట్ ఎదుట నిరసన తెలుపుతున్న సీపీఎం నాయకులు

ములుగు టౌన్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): పుల్యాల వసంత పేరుతో మంజూరైన అక్రమ పట్టాను రద్దు చేసి పేదలకు పట్టాలివ్వాలని సీపీఎం ములుగు జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు తుమ్మల వెంకట్‌రెడ్డి డిమాండ్ చేశారు. బుధవారం కలెక్టర్ కార్యాలయం ఎదుట సీపీఎం గోవిందరావుపేట మండల కమిటీ ఆధ్వర్యంలో ధర్నా చేశారు. అనంతరం కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ గోవిందరావుపేట మండలం పస్రా రెవెన్యూ శివారులోని 40 ఎకరాల ప్రభుత్వ భూమిని పుల్యాల వసంత పేరుతో అక్రమ పట్టా చేయించుకున్నారని ఆరోపించారు. ఈ భూమి 30 ఎకరాల్లో చిన్న సన్నకారు రైతులు సాగులో ఉండగా మిగతా 10 ఎకరాల భూమిలో 570 మంది నిరుపేదలు గుడిసెలు వేసుకొని 5 సంవత్సరాలుగా నివాసం ఉంటున్నారని తెలిపారు. ఈ భూమికి వసంతకు ఎలాంటి సంబంధం లేదని ఆమె భర్త లాయర్ కావడం వల్ల ఈ భూమిని కాజేయడం కోసం నకిలీ డాక్యుమెంట్లు సృష్టించారని ఆరోపించారు. అధికారులు చొరవ చూపి నిరుపేదలకు పట్టాలివ్వాలన్నారు. కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి సోమ మల్లారెడ్డి, జిల్లా నాయకులు పోదిళ్ల చిట్టిబాబు, తీగల ఆది రెడ్డి, గోంది రాజేష్, రత్నం ప్రవీణ్, డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు కలువల రవీందర్, మండల కమిటీ సభ్యులు కడారి నాగరాజు, బుర్ర శ్రీనివాస్, రామోజు, సువర్ణ, చిన్నపల్లి అశోక్, సరళ, కోయిల, సులోచన, బ్రహ్మచారి, ఐలయ్య తదితరులు పాల్గొన్నారు.

హేమాచలుడి శాంతి కల్యాణం


నరసింహస్వామి కల్యాణం జరిపిస్తున్న పూజారి

మంగపేట నవంబరు 19 (ఆంధ్రజ్యోతి) హేమాచలుడి శాంతి కల్యాణాన్ని బుధవారం ఘనంగా జరిపించారు. లక్ష్మీ నరసింహస్వామి, చెంచులక్ష్మి, ఆదిలక్ష్మి అమ్మవార్ల ఉత్సవ విగ్రహాలను చింతామణి జలాలతో అభిషేకించి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ సంప్రదాయం ప్రకారం స్వాతి నక్షత్రం సందర్భంగా స్వామి వారి కల్యాణం వైభవంగా నిర్వహించినట్లు ఆలయ ప్రధాన అర్చకుడు రాజశేఖరశర్మ తెలిపారు. ఈ కల్యాణానికి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు.

రోడ్డుపై గుంతలు పూడ్చాలని నిరసన

మంగపేట, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి) ఏటూరునాగారం బూర్గంపహాడ్ ప్రధాన రహదారిపై కోమటిపల్లి క్రాస్‌రోడ్డు వద్ద భారీగా ఏర్పడిన గుంతలను పూడ్చాలని కోరుతూ స్థానిక మహిళలు బుధవారం రోడ్డుపై నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు విలేకరులతో మాట్లాడారు. గుంతలు పడ్డ రోడ్డుపై నుండి వందలాది ఇసుక లారీలు వెళ్తుండడంతో దుమ్ముధూళి ఇళ్లల్లోకి వస్తుందని ఊపిరి ఆడక ఆస్పత్రుల పాలవుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. ఇటీవలి తాత్కాలికంగా గుంతలు పూడ్చిన ఆర్ అండ్ బీ అధికారులు కోమటిపల్లి క్రాస్‌రోడ్డు వద్ద గుంతలను పూడ్చలేదన్నారు. మహిళల నిరసనతో ఇసుక లారీలు, ఇతర వాహనాల రాకపోకలు స్తంభించిపోయాయి. అధికారులతో మాట్లాడి రోడ్డు గుంతలు పూడ్చేలా చర్యలు తీసుకుంటామని ఎస్సై టీవీఆర్ సూరి మహిళలకు నచ్చజెప్పడంతో వారు నిరసనను విరమించారు.

మహిళా కాంగ్రెస్ గ్రామ కమిటీ ఎన్నిక

ములుగు రూరల్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మదనపల్లిలో బుధవారం మహిళా కాంగ్రెస్ గ్రామ కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షురాలిగా కందకట్ల సంధ్యారాణి, ఉపాధ్యక్షురాలిగా భూక్య యమున, ప్రధాన కార్యదర్శిగా బంక అరుణ, కోశాధికారిగా బలుగూరి రజిత, అధికార ప్రతినిధిగా కందకట్ల చంద్రకళ, కార్యదర్శిగా పోరిక రజిత, సహాయ కార్యదర్శిగా భూక్య కవితను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మహిళా మండల అధ్యక్షురాలు గుంటోజు పావని, పట్టణ అధ్యక్షురాలు పిట్టల రాధిక, కార్యదర్శి అల్లూరి సంధ్య, జక్కుల స్వర్ణ, కొయ్యడ లక్ష్మి, ఎండీ ఆసియా తదితర నాయకురాళ్లు పాల్గొన్నారు.

నేటి బస్సు జాతాను విజయవంతం చేయాలి

ములుగు రూరల్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): ములుగులో గురువారం జరిగే బస్సుజాతాను విజయవంతం చేయాలని సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి జంపాల రవీందర్ కోరారు. జిల్లా కేంద్రంలో బుధవారం నిర్వహించిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. అనేక పోరాటాలు, కార్మిక హక్కులు, చట్టాలను సాధించిన పార్టీ సీపీఐ అని, వంద సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా శత జయంతి ఉత్సవాల పేరుతో జరుగుతున్న ఈ బస్సుజాతాను జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు అమ్జద్ పాషా, నాయకులు ముత్యాల రాజు, బుడిమె సదయ్య, గుంజె శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ములకనపల్లిలో పోస్టాఫీసు ప్రారంభం

వాజేడు, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మారుమూల గ్రామం ములకనపల్లిలో బుధవారం తపాలా కార్యాలయాన్ని భద్రాచలం అసిస్టెంట్ సూపరింటెండెంట్ ప్రకాశ్‌రావు బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మారుమూల ప్రాంతాలకూ తపాలా సేవలను అందించాలనే లక్ష్యంతో పోస్టాఫీస్‌ను ఏర్పాటు చేశామన్నారు. పోస్టాఫీస్ సేవలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎంవో గోపాల్‌రావు, బీపీఎం మోహన్‌రెడ్డి, కార్యదర్శి రేఖశ్రీ, గ్రామస్థులు పాల్గొన్నారు.

మాదక ద్రవ్యాలు వాడొద్దు

కృష్ణకాలనీ, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): మాదక ద్రవ్యాలకు యువత వాడొద్దని, వాటికి దూరంగా ఉండాలని యాంటీ నార్కోటిక్ బ్యూరో డీఎస్పీ రమేష్‌కుమార్ సూచించారు. భూపాలపల్లిలోని ప్రభుత్వ వైద్య కళాశాలలో మాదక ద్రవ్యాల నిర్మూలనకై బుధవారం జరిగిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. డ్రగ్స్ రహిత సమాజ నిర్మాణం కోసం విద్యార్థులు, ప్రజల భాగస్వామ్యం ఎంతో అవసరమన్నారు. వ్యసనాలకు దూరంగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో నార్కోటిక్ ఇన్‌స్పెక్టర్ కె.శ్రీకాంత్, ప్రిన్సిపాల్ జె. వెంకటేశ్వర్లు, వైస్ ప్రిన్సిపల్ రాజేష్, బి. శ్రీధర్‌రావు, డైరెక్టర్ వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

డిజిటల్ సర్టిఫికెట్ల క్యాంపెయిన్‌ను సద్వినియోగం చేసుకోవాలి : సింగరేణి జీఎం


మాట్లాడుతున్న సింగరేణి ఏరియా ఇన్‌చార్జి జనరల్ మేనేజర్ కవీంద్ర

కృష్ణకాలనీ, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): డిజిటల్ సర్టిఫికెట్ల క్యాంపెయిన్‌ను కార్మికులు సద్వినియోగం చేసుకోవాలని సింగరేణి ఇన్‌చార్జి జనరల్ మేనేజర్ ఎస్. కవీంద్ర అన్నారు. పెన్షన్ల కోసం బుధవారం క్యాంపెయిన్‌కు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. స్థానిక జీఎం కార్యాలయంలో గోదావరిఖని అధికారులతో జీవన్ ప్రమాణ్ పునరుద్ధరణపై క్యాంపు నిర్వహించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏరియా పర్సనల్ మేనేజర్ కావూరి మారుతి, డీవైపీఎం క్రాంతికుమార్, సీఎంపీఎఫ్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

యోగాను దినచర్యగా పాటించాలి

కృష్ణకాలనీ, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): యోగాను ప్రతి ఒక్కరూ తమ దినచర్యగా పాటించాలని ఏరియా పర్సనల్ మేనేజర్ కావూరి మారుతి అన్నారు. 'మిషన్ హెల్దీ సింగరేణి'లో భాగంగా భూపాలపల్లిలోని జీవీటీసీ కార్యాలయంలో 'ప్రాచీన యోగా-దినచర్య' అనే అంశంపై బుధవారం నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. యోగా ప్రాచీన కాలం నుంచి ఉందని, దీనిని ప్రతి ఒక్కరూ పాటించి ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా యోగా ప్రాముఖ్యతను గురువు షణ్ముఖశివచంద్ర పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా తెలియజేశారు. ఈ కార్యక్రమంలో వీటీసీ మేనేజర్ పాఠక్, ఉద్యోగులు, వివిధ యూనియన్ల నేతలు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు పుట్ట మధు పరామర్శ


రుద్రారంలో మృతుడి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న పుట్ట మధు

మల్హర్, నవంబరు 19(ఆంధ్రజ్యోతి) : మండలంలోని మల్లారం, రుద్రారంలో ఇటీవల మృతి చెందిన వారి కుటుంబాలను మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధు బుధవారం పరామర్శించారు. రుద్రారం గ్రామానికి చెందిన రైతు ఐలయ్య విద్యుత్ షాక్‌తో, మల్లారం గ్రామానికి చెందిన రేషన్ డీలర్ పురుషోత్తం మృతి చెందగా వారి కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు.

● కాటారం, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): మండలంలో బీఆర్ఎస్ మంథని నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే పుట్ట మధు బుధవారం పర్యటించారు. ఒడిపిలవంచ గ్రామంలో గాడిపెల్లి బానయ్య మృతి చెందగా ఆయన కుటుంబాన్ని పరామర్శించారు. బానయ్య చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. మధు వెంట బీఆర్ఎస్ మండల ఇన్‌చార్జి జోడు శ్రీనివాస్, యూత్ మండల అధ్యక్షుడు రామిళ్ల కిరణ్, బీఆర్ఎస్ నాయకులు నరివెద్ది శ్రీనివాస్, గాలి సడువలి, చిట్యాల సమ్మయ్య, చీమల వంశీ, జాడి శ్రీశైలం, శంకర్, మహేష్, శ్యామ్‌సుందర్, రాజేంద్రప్రసాద్, సుధాకర్ తదితరులు ఉన్నారు.

ప్రిన్సిపాల్‌పై సమగ్ర విచారణ చేపట్టాలి

మల్హర్, నవంబరు 19(ఆంధ్రజ్యోతి) : ఎడ్లపల్లి మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్‌పై సమగ్ర విచారణ చేపట్టాలని డీవైఎఫ్ఐ రాష్ట్ర కమిటీ సభ్యుడు ఆత్కూరి శ్రీకాంత్ డిమాండ్ చేశారు. కొయ్యూర్‌లో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మోడల్ స్కూల్‌కు సంబంధించిన పీఎంశ్రీ నిధుల్లో అవకతవకలు జరిగాయని అనుమానాలు తమకు ఉన్నాయన్నారు. దీనిపై విచారణ చేపట్టి చర్యలు తీసుకోవాలన్నారు. విలేకరుల సమావేశంలో కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి శ్రీధర్, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

వాళ్లు వదిలేశారు.. మేమిస్తున్నాం..

- పారదర్శకంగా డబుల్‌బెడ్‌రూం ఇళ్లు పంపిణీ
- ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు


డబుల్‌బెడ్‌రూం ఇంటి పట్టాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే సత్యనారాయణరావు, కలెక్టర్ రాహుల్ శర్మ

కృష్ణకాలనీ, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): గత సర్కారు డబుల్ బెడ్‌రూం ఇళ్లను మధ్యలో వదిలేయగా వాటిని పూర్తి చేసి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పూర్తి చేసి, పంపిణీ చేస్తున్నామని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు అన్నారు. భూపాలపల్లిలో భాస్కర్‌గడ్డలో నిర్మించిన 416 డబుల్ బెడ్‌రూం ఇళ్లల్లో 409 ఇళ్లను లబ్ధిదారులకు కలెక్టర్ రాహుల్ శర్మతో కలిసి డ్రా పద్ధతిన కేటాయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదలకు ఇళ్లు అందించాలనే ధృడ సంకల్పంతో ముందుకెళ్లామన్నారు. అర్హులైన లబ్ధిదారుల ఎంపికలో పూర్తి పారదర్శకత ఉందని స్పష్టం చేశారు. ఎన్ని ఇబ్బందులు ఎదరైనా, ఒత్తిళ్లు వచ్చినా వేటికి తలొగ్గకుండా ఇళ్లులేని నిరు పేదలకు మాత్రమే ఇళ్ల కేటాయింపు చేశామని వివరిం చారు. కలెక్టర్ రాహుల్‌శర్మ మాట్లాడుతూ నాలుగు దశల వారీగా ప్రత్యేక అధికారులను నియమించి అర్హులను ఎంపిక చేశామ న్నారు. అసంపూర్తిగా ఉన్న విద్యుత్ సరఫరా, ఇతరత్రా పనుల ను సైతం త్వరితగతిన పూర్తి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ విజయలక్ష్మి, గృహ నిర్మాణ శాఖ పీడీ లోకిలాల్, మనిసిపల్ కమిషనర్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

వృద్ధులు సమాజానికి మార్గదర్శకులు

వృద్ధులు సమాజానికి మార్గదర్శకులని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు అన్నారు భూపాలపల్లిలోని ఐడీవోసీ కార్యాలయంలో అంతర్జాతీయ వృద్ధుల దినోత్సవాన్ని పురస్కరించుకొని నిర్వహించిన కార్యక్రమంలో కలెక్టర్ రాహుల్‌శర్మతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వృద్ధుల శ్రేయస్సు, ఆరోగ్య, భద్రత కోసం ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు ప్రయోజనాలను అర్హులకు చేరేలా చర్యలు తీసుకుంటామన్నారు. కలెక్టర్ మాట్లాడుతూ వృద్ధులకు సంబంధించిన సంక్షేమ పథకం అమలు, అవసరమైన సేవలు, ఆరోగ్య పరీక్షలు, సహాయక పరికరాల పంపిణీ వంటి కార్యక్రమాలను సమర్థంగా నిర్వహి స్తున్నామని తెలిపారు. అనంతరం ఎమ్మెల్యే, కలెక్టర్ వృద్ధులను శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ నవీన్‌రెడ్డి, సంక్షేమాధికారిని మల్లేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి చేయూత

మంగపేట, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని తిమ్మంపేటలో ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన గడదాసు పూర్ణచందర్ కుటుంబాన్ని శ్రీరామకృష్ణ సేవా ట్రస్ట్ బాధ్యుడు నాగ రమేష్ రూ. 5 వేలు ఆర్థిక సాయం అందజేశారు. అలాగే రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన పదుర్గం బాలకృష్ణ కుటుంబానికి రూ.4 వేలు ఆర్థిక సాయం అందజేశారు. పేదలకు శ్రీరామకృష్ణ సేవా ట్రస్ట్ అండగా ఉంటుందని రమేష్ అన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు తుక్కని శ్రీనివాస్, ఎగ్గడి అర్జున్, చిలకమర్రి రాజేందర్, బాడిశ నవీన్, పూసల నర్సింహారావు తదితరులు పాల్గొన్నారు.

చెరువు కట్ట మరమ్మతులు ప్రారంభం

మల్హర్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని మల్లారం చెరువు కట్ట మరమ్మతు పనులు బుధవారం ప్రారంభించారు. గ్రామస్థులు, ఆయకట్టు రైతులు చెరువు కట్ట మరమ్మతు పనులు చేపట్టాలని ఓసీపీలో బొగ్గ నిక్షేపాలు వెలికితీస్తున్న ఏఎమ్మార్ కంపెనీ వైస్ ప్రెసిడెంట్ ప్రభాకర్‌రెడ్డిని కోరారు. వైస్ ప్రెసిడెంట్ ప్రభాకర్‌రెడ్డి, సీనియర్ జనరల్ మేనేజర్ మూర్తి ఆదేశాల మేరకు పనులను ప్రారం భించారు. ఈ కార్యక్రమంలో గ్రామస్థులు, రైతులు, వర్క్ సూపర్ వైజర్ బొబ్బిలి నరేష్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభం

కాటారం, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి):మండలంలోని రేగులగూడెం గ్రామపంచాయతీ పరిధిలోని గంగారం 33/11కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్‌కు సీసీ రోడ్డు నిర్మాణ పనులను బుధవారం ప్రారంభించారు. రూ.5 లక్షల సీఆర్ఆర్ నిధులతో చేపడుతున్న సీసీ రోడ్డు నిర్మాణపనులను విద్యుత్ అధికారులు కాంగ్రెస్ నాయకులు, స్థానికులతో కలిసి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో లైన్‌మన్ ప్రవీణ్ కుమార్, మాజీ సర్పంచ్ నవీన్‌రావు, యూత్ కాంగ్రెస్ గ్రామ అధ్యక్షుడు రజనీకాంత్, కాంగ్రెస్, యూత్ కాంగ్రెస్ నాయకులు తెప్పల ప్రభాకర్, తూటి నారాయణ, మొగిలి రాజ్‌కుమార్, నంది శశికుమార్, సాయికుమార్, కంబాల వంశీవర్ధన్, సబ్‌స్టేషన్ ఆపరేటర్ రవి, తిరుపతి పాల్గొన్నారు.

బాల్య వివాహాల నిర్మూలనపై అవగాహన

మహదేవపూర్, నవంబరు19(ఆంధ్రజ్యోతి): మహదేవపూర్ జడ్పీహెచ్ఎస్ గర్ల్స్ ప్రభుత్వ పాఠశాలలో బాల్య వివాహాల నిర్మూలనపై అవగాహన కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. బాల్యవివాహాల అనర్థలపై డీహెచ్ఈడబ్ల్యూ జెండర్ స్పెషలిస్టు అనూష, సీహెహెచ్ఎల్ ప్రతినిధి ప్రవీణ్ మాట్లాడారు. సఖి కౌన్సిలర్ మాధవి, ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాస్‌రెడ్డి, వలీపాషా, వసుధ, శ్రీనివాస్, షాహిదా, సమ్మయ్య, రజిత, వీరేశం, ఆంజనేయులు, సమ్మయ్య పాల్గొన్నారు.

దత్తాత్రేయ స్వామి ఆలయంలో ఆకాశ దీపావరోహణం

కాటారం, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): మండలంలోని ధన్వాడ శ్రీ దత్తాత్రేయస్వామి ఆలయంలో ఆకాశదీప అవరోహణం కార్యక్రమం బుధవారం రాత్రి నిర్వహించారు. కార్తీక మాస ముగింపును పురస్కరించుకొని అర్చకులు కృష్ణమోహన్‌శర్మ, సుమిత్‌పాండే, ప్రవీణ్ శర్మ, గణేష్‌శర్మలు దత్తాత్రేయస్వామి, కాశీకేదారేశ్వరస్వామికి ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. సాయంత్రం ఆలయం ఎదుట ధ్వజస్తభానికి కార్తీక మాస ప్రారంభం రోజున ఆకాశదీపారోహణం గావించగా నెల రోజుల అనంతరం ఆకాశదీప అవరోహణం . చేశారు. ఈ సందర్భంగా పలు గ్రామాలకు చెందిన భక్తులు ప్రత్యేక పూజలు చేసి స్వామివార్లకు మొక్కుకున్నారు. ఈ కార్యక్రమంలో పలువురు గ్రామపెద్దలు, ఆలయ కమిటీ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

వెంకటాపురం, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్ర మత్తంగా ఉండాలని వైద్యాధికారి జ్యోతి అన్నారు. బుధవారం మండలంలోని వీరభద్రవరం గ్రామంలో వైద్యారోగ్యశాఖ ఆధ్వర్యంలో వైద్య శిబిరం నిర్వహించారు. గ్రామస్థులకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. పలువురి నుంచి రక్తనమూనాలు సేకరించారు. ఆమె మాట్లాడుతూ గ్రామస్థులు వ్యక్తిగత పరిశుభ్రత, పరిసరాల పరిశుభ్రత పాటించాలని సూచించారు.

వాకర్స్‌కు టీషర్టుల పంపిణీ

వెంకటాపూర్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని వాకర్స్‌కు ఎన్ఎస్‌యూఐ జిల్లా అధ్యక్షుడు మామిడిశెట్టి కోటి ఆధ్వర్యంలో బుధవారం ప్రత్యేకంగా ముద్రించిన టీషర్టులను ఎస్సై చల్ల రాజు అందజేశారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ ఆరోగ్యకరమైన జీవనశైలిని అలవర్చుకునేలా ప్రజల్లో చైతన్యం కల్పించడానికి టీషర్టులు పంపిణీ చేయడం అభినందనీయమన్నారు. ఆరోగ్యంగా ఉండాలంటే ప్రతిరోజూ అరగంట వాకింగ్ చేయాలన్నారు. కార్యక్రమంలో వాకర్స్ బానోత్ యోగి, అజ్మీరా రమేష్, మంద రమేష్, వడ్డెపల్లి నగేష్, రెడ్డి శ్రీధర్, ఆకుల సుమన్, పల్నాటి కోటి, మామిడిశెట్టి ధర్మతేజ, పసునూటి నవీన్ తదితరులు పాల్గొన్నారు.

బాలికల విద్యపై అవగాహన సదస్సు

మంగపేట, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి) : బాలికల విద్య ప్రాధాన్యంపై బుధవారం మండలంలోని కమలాపురం జడ్పీ పాఠశాలలో చైల్డ్ వెల్ఫేర్ జిల్లా అధికారులు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా చైల్డ్ వెల్ఫేర్ ములుగు అధికారులు స్రవంతి, మౌనిక మాట్లాడారు. ఇల్లాలి చదువు ఇంటికి వెలుగు అన్నారంటే మహిళల చదువుకున్న ప్రాధాన్యం మనం గ్రహించాలన్నారు. బాలికలు గుడ్, బ్యాడ్ టచ్ గురించి తెలుసుకోవాలని బాల్య వివాహాలు, ప్రేమ వ్యవహారాలు వంటి వాటికి దూరంగా ఉండి చక్కగా చదువుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి హెచ్ఎం ప్రసాద్, ఉపాధ్యాయులు నరేష్, నాగలక్ష్మి, భూలక్ష్మి, నాగమ్మ, రాజేశ్వర్‌రావు, విద్యార్థులు పాల్గొన్నారు.

టెన్త్ టాపర్లకు నగదు బహుమతి

తాడ్వాయి, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులు మండల ప్రథమ స్థానం పొందిన వారికి రూ. 10,016 అందిస్తామని ఎంఈవో గడ్డి శ్రీనివాస్ అన్నారు. బుధవారం తాడ్వాయి మండలంలోని కాటాపూర్ గ్రామం ప్రభుత్వ పాఠశాలలో జ్వాలా ట్రస్టు చైర్మన్ నరేష్ రెడ్డి ఆధ్వర్యంలో క్రీడా యూనిఫామ్‌ను పంపిణీ చేశారు. విద్యార్థులు శ్రద్ధతో చదివి నగదు బహుమతి పొందాలని సూచించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు సుధాకర్, కార్తీక్, సక్రు, పాపారావు, శ్యాంసన్, విజయ, విద్యార్థులు పాల్గొన్నారు.

ఫొటోగ్రాఫర్ హఠాన్మరణం



వెంకటాపూర్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): మండలకేంద్రానికి చెందిన సీనియర్ ఫొటోగ్రాఫర్ మోడెం వెంకటేశ్వర్లు(45) మృతి చెందారు. వ్యాపార పరిస్థి తుల దృష్ట్యా జీవ నోపాధిలో భాగంగా కొంతకాలం క్రితం కుటుంబ సమేతంగా హైదరాబాద్ వలస వెళ్లిన ఆయన మంగళవారం రాత్రి గుండె పోటుకు గురై తుది శ్వాస విడిచారు. వెంకటేశ్వర్లు గతంలో ఓ దినపత్రికలో పనిచేశారు. ఆయన ఆయన భౌతికకాయాన్ని ఫొటో గ్రాఫర్లు, జర్నలిస్టులు సందర్శించి నివాళులు అర్పించారు. మృతుడి కుటుంబానికి ఫొటో గ్రాఫర్ యూనియన్ నాయకులు రూ.60 వేల చెక్కును అందజేశారు. మృతదే హాన్ని సందర్శించిన వారిలో జర్నలిస్టులు ఎం.డి.షఫీ అహ్మద్, బేతి సతీష్‌యాదవ్, దూడబోయిన రాకేష్, పిల్లలమర్రి రాము, దేశిని మహేందర్, వినీల్, బానోత్ యోగి, వేముల సతీష్, బాలాజీ రవి తదితరులు

ఆదాయం చారాణా.. వ్యయం బారాణా

(5వ పేజీ తరువాయి)

యాజమాన్యం సరికొత్త లక్ష్యాన్ని నిర్దేశించుకుంటోంది. ఇందులో భాగంగా భూపాలపల్లి ఏరియాలో 2025-26 సంవత్సరానికి బొగ్గు ఉత్పత్తి, ఓవర్ బర్డెన్ తొలగింపు వంటి అంశాలపై దృష్టి సారించింది. అక్టోబరు మాసానికి సంబంధించి నిర్దేశించుకున్న లక్ష్యం 4.23 లక్షల టన్నులకు 2.33లక్షల టన్నుల(55శాతం) ఉత్పత్తి చేశారు. అలాగే 52.00 క్యూబిక్ మీటర్ల ఓవర్ బర్డెన్ వెలికితీతకు 32.92 క్యూబిక్ మీటర్ల ఓవర్ బర్డెన్‌ను వెలికి తీశారు. అలాగే బొగ్గు రవాణాకు సంబంధించి 4.23 లక్షల టన్నులకు 2.16 లక్షల టన్నుల బొగ్గును రవాణా చేసినట్టు అధికారులు చెబుతున్నారు. ఇప్పటి వరకు అక్టోబరులో 55 శాతం బొగ్గు ఉత్పత్తి లక్ష్యాన్ని సాధించినట్లు తెలుస్తోంది. రాబోయే రోజుల్లో వార్షిక లక్ష్యానికి తగ్గట్టు ఉత్పత్తిని సాధించే దిశగా కార్మికుల హాజరు శాతాన్ని పెంచేందుకు అవగాహన కల్పించేందుకు ప్రయత్నిస్తున్నారు. ఉపరితల గనుల్లో ఉత్పత్తిని మరింత పెంచడం ద్వారా సంస్థాగత నష్టాలను తగ్గించుకోవచ్చన్న యాజమాన్యం ఆదేశాల మేరకు సింగరేణి భూపాలపల్లి ఏరియాలో ఉత్పత్తి పెంపుపై సీరియస్‌గా దృష్టి సారించింది.

లేటుగా వచ్చినా.. లేటెస్టేనట!

ప్రభుత్వ కార్యాలయాల్లో అధికారుల నిర్లక్ష్యం .. ఆలస్యంగా వస్తున్న అధికారులు


ఉదయం 11గంటలైనా ఖాళీగానే ఉన్న ఎంపీడీవో కార్యాలయ సూపరింటెండెంట్ కుర్చీ

మహదేవపూర్ రూరల్, నవంబరు 19(ఆంధ్రజ్యోతి) : అక్కడ అధికారులు సమయానికి రారు. వచ్చినా సమస్యలు తీర్చరు. మహదేవపూర్ మండల కేంద్రంలోని ఎంపీడీవో, పంచాయతీరాజ్, ఎస్‌టీవో కార్యాలయాల దుస్థితి ఇది. ఉదయం 11 గంటలు దాటినా కార్యాలయాల్లో అధికారులు, ముఖ్య విభాగాలు చూసే ఉద్యోగులు అడుగు పెట్టరు. దీంతో పెద్దంపేట, ఎన్కపల్లి, అంబట్‌పల్లి, రాపల్లికోట వంటి సుదూర ప్రాంతాల నుంచి వివిధ పనుల నిమిత్తం కార్యాల యానికి వచ్చే వారు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఆయా కార్యాల యాల్లో బుధవారం ఈ దృశ్యాలే కనిపించాయి. ఎంపీడీవో కార్యాలయంలో అటెండర్లు, మరో ముగ్గురు ఉద్యోగులు మాత్రమే ఉన్నారు. సమయ పాలన, హాజరు, ఇతరత్రా పర్యవేక్షించాల్సిన సూపరింటెండెంట్‌తో పాటు జూనియర్ అసిస్టెంట్ కూడా అందుబాటులో లేరు. సెలవులో ఎమైనా ఉన్నారా? అని ఆఫీసులో అడగ్గా సరైన సమాధానం లభించలేదు. 11 గంటల తర్వాత సూరింటెండెంట్ నెమ్మదిగా అడుగు పెట్టారు. 'హనుమకొండ నుంచి రావాలి కదా.. అందుకే లేట్ అవుతున్నది' అంటూ ఆయన సమాధానం చెప్పడం అక్కడున్న వారిని విస్మయానికి గురిచేసింది. ఆయన పోస్టింగ్ కాటారం కాగా డిప్యూటేషన్‌పై మహదేవపూర్‌లో పనిచే స్తున్నారు.

పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ కార్యాలయంలోనూ ఇదే పరిస్థితి. కార్యాలయం తెరుచుకున్నప్పటికీ డీఈఈ, ఏఈఈ గదులు తాళాలతో దర్శనమిచ్చాయి. కనీసం సమాచారం ఇవ్వడానికి అటెండర్ కూడా అందుబాటులో లేరు. డీఈఈకి ఫోన్ చేస్తే అందుబాటులోకి రాలేదు. మండల కేంద్రంలోని ఎస్టీవో కార్యాలయంలోనూ అదే పరిస్థితి కనిపించింది. ఉదయం 11గంటలైనా ఎస్టీవోతో పాటు కింది స్థాయి ఉద్యోగులు కనిపించలేదు. ఈ కార్యాలయాల్లో అధికారులు, ఇతర ఉద్యోగుల నిర్వాకంపై అడిషనల్ కలెక్టర్ (స్థానిక సంస్థలు) విజయలక్ష్మి దృష్టికి తీసుకెళ్లగా అధికారులు విధులకు ఆలస్యంగా వస్తున్న విషయం తనకు తెలియదన్నారు. విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ఎంతటి వారినైనా ఉపేక్షించేది లేదన్నారు.


ఉదయం 11గంటలైనా ఖాళీగా దర్శనమిస్తున్న ఎస్టీవో కార్యాలయం